


అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక



1 హన్మకొండ,వరంగల్, జయశంకర్, ములుగు, జనగామ, మహబూబాబాద్

గురువారం 23 మార్చి 2023

శ్రీ పట్టాభి రామాలయం చైర్మన్‌గా గోవర్ధన్



నవతెలంగాణ-గణపురం

శ్రీ పట్టాభి రామస్వామి దేవాలయ చైర్మన్‌గా తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్. బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్త సంవత్సర పంచాగ శ్రవణ కార్యక్ర మం శ్రీమన్ గోవర్ధన దూర్వాసాచార్యులు, గోవర్ధన శ్రీనివాసచార్యుల ఆధ్వర్యంలో పంచాంగ శాస్త్రాన్ని నిర్వహించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

'పశ్చిమ' కాంగ్రెస్‌లో మళ్లీ రచ్చ

కాజీపేటలో 'జంగా' కార్యక్రమాలు

అధిష్టానానికి 'నాయిని' ఫిర్యాదు





నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కాంగ్రెస్‌లో మళ్లీ డిసిసి హన్మకొండ జిల్లా అధ్యక్షులు నాయిని రాజేందర్‌రెడ్డి, జనగామ డిసిసి అధ్యక్షులు జంగా రాఘవరెడ్డిల మధ్య మళ్లీ రచ్చ మొదలైంది. మంగళవారం 'జంగా' పశ్చిమ నియోజకవర్గంలోని కాజీపేట ప్రాంతంలో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గతంలో ఇలాగే పాల్గొన్నందుకే టిపిసిసి క్రమశిక్షణా సంఘం ఆయన్ను మందలించింది. జనగామ జిల్లాలోనే పార్టీ కార్యక్రమాలు నిర్వహించాలని, హన్మకొండ జిల్లాలో పార్టీ కార్యక్రమాలు నిర్వహించాలంటే హన్మకొండ డిసిసి అధ్యక్షుడి అనుమతితో చేయాలని ఆదేశించింది. నాడు వెనక్కి తగ్గిన 'జంగా' తాజాగా మళ్లీ కాజీపేట ప్రాంతంలో తన అనుచరులతో పార్టీ కార్యక్రమాలను నిర్వహించడమే కాకుండా 'పశ్చిమ' నుండే పోటీ చేస్తానని, 'నాయిని' స్థానికేతరుడని వ్యాఖ్యానించడంతో ఇద్దరి మధ్య రగడ మళ్లీ షురూ అయ్యింది. 'జంగా' వ్యవహారంపై 'నాయిని' పార్టీ నాయకత్వానికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

వరంగల్ పశ్చిమ నియోజకవర్గం కాంగ్రెస్‌లో మళ్లీ జనగామ డిసిసి అధ్యక్షులు జంగా రాఘవరెడ్డి, హన్మకొండ డిసిసి అధ్యక్షులు నాయిని రాజేందర్‌రెడ్డి మధ్య పోరు మొదలైంది. గతంలో 'జంగా' వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుండే పోటీ చేయనున్నట్లు ప్రకటించి కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు నిర్వహించారు. దీనిపై 'నాయిని' పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. దీంతో టిపిసిసి క్రమశిక్షణా సంఘం సీరియస్‌గా స్పందించింది. జనగామ జిల్లాలోనే పార్టీ కార్యక్రమాలు నిర్వహించాలని, హన్మకొండ జిల్లాలో నిర్వహించాలంటే హన్మకొండ డిసిసి అధ్యక్షుడి అనుమతి తప్పనిసరని 'జంగా'కు స్పష్టం చేసింది. ఈ క్రమంలో వెనక్కి తగ్గిన 'జంగా' గత రెండ్రోజులుగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని కాజీపేట ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దీంతో రెండు వర్గాల మధ్య మళ్లీ వివాదం ఉత్పన్నమైంది.

'నాయిని' స్థానికేతరుడు : జంగా

హన్మకొండ డిసిసి అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి స్థానికేతరుడని, వచ్చే ఎన్నికల్లో పార్టీ టికెట్ నాకే వస్తుందని, నేనే గెలుస్తానని జంగా రాఘవరెడ్డి కాజీపేటలో పార్టీ కార్యక్రమంలో వ్యాఖ్యానించడం వివాదాస్పదంగా మారింది. నేను స్థానికుడినని, నియోజకవర్గంలో పట్టుందని 'జంగా' చెప్పుకొచ్చారు. ఈ వ్యాఖ్యలపై 'నాయిని' వర్గం తీవ్ర ఆగ్రహంతో వుంది. 'జంగా' గత ఎన్నికల్లో పాలకుర్తి నియోజకవర్గం నుండి పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం టిపిసిసి 'జంగా'కు జనగామ డిసిసి అధ్యక్ష పదవిని కట్టబెట్టింది. నాటి నుండి జనగామ జిల్లా పార్టీ కార్యక్రమాలను నిర్వహించిన 'జంగా' తాజాగా వచ్చే ఎన్నికల్లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుండే పోటీ చేస్తానని ప్రకటించారు. దీంతో 'నాయిని', 'జంగా'ల మధ్య పొలిటికల్ వార్ మొదలైంది. అంతేకాకుండా 'జంగా' కాజీపేట ప్రాంతంలో పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తూ అన్ని డివిజన్‌లలో పర్యటించే ప్రయత్నంలో వుండగానే 'నాయిని' టిపిసిసికి ఫిర్యాదు చేశారు. టిపిసిసి ఆదేశాలతో క్రమశిక్షణ సంఘం రంగ ప్రవేశం చేసి 'జంగా'ను కట్టడి చేసింది. తాజాగా మళ్లీ 'జంగా' వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో తన కార్యక్రమాలను పున:ప్రారంభించడంతో మళ్లీ రెండు వర్గాల మధ్య పొలిటికల్ హీట్ పెరిగింది.

'జంగా'పై 'నాయిని' ఫిర్యాదు

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడమే కాకుండా, తనపై చేసిన వ్యాఖ్యల విషయంలో హన్మకొండ డిసిసి అధ్యక్షులు నాయిని రాజేందర్‌రెడ్డి టిపిసిసి నాయకత్వానికి ఫిర్యాదు చేశారు. గతంలో ఫిర్యాదు చేశాక క్రమశిక్షణా సంఘం స్పందించి 'జంగా'ను కట్టడి చేసిన విషయం విదితమే. ఇదిలావుంటే 'నాయిని' రేవంత్‌రెడ్డి హాత్ సే హాత్ జోడో పాదయాత్ర ప్రారంభించిన నాటి నుండి నియోజకవర్గంలో ప్రతి డివిజన్‌లో పాదయాత్రను నిర్వహిస్తున్నారు. పాదయాత్ర ద్వారా ప్రజలను నేరుగా కలుస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిన హామీలు, స్థానికంగా ప్రధాన సమస్యలను పరిష్కరించకపోవడంపై విమర్శలు చేస్తూ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఈ క్రమంలో 'జంగా' వ్యాఖ్యలతో 'నాయిని' వర్గంలో కలకలం రేగింది. తాజాగా మళ్లీ 'నాయిని' టిపిసిసి నాయత్వానికి 'జంగా'పై ఫిర్యాదు చేయడంతోపటు ఆయన చేసిన వ్యాఖ్యల క్లిప్పింగ్‌లను కూడా పంపినట్లు సమాచారం. వీరిద్దరి మధ్య ఆధిపత్య పోరుతో 'పశ్చిమ' నియోజకవర్గంలోని కాంగ్రెస్ వర్గాల్లో అలజడి ప్రారంభమైంది. ఏదేమైనా ఈ విషయంలో పార్టీ అధిష్టానం ఎంత తొందరగా స్పష్టతనిస్తే అంత మంచిదని పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

'స్టేషన్' కారులో కాక..

కొత్త అభ్యర్థి రంగంలోకి..

ముగ్గురి మధ్య తీవ్ర పోటీ



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కారు పార్టీలో కాక పుట్టింది. ఇద్దరు మాజీ డిప్యూటీ సిఎంలు కడియం శ్రీహరి, డాక్టర్ తాటికొండ రాజయ్యల మధ్య ఆధిపత్య పోరు, రాజకీయ కుట్రలు వెరసి వారిద్దరిని కాదని మూడో వ్యక్తిని బరిలోకి దించుతారా ? అంటే అవుననే ప్రచారమే బలంగా సాగుతుంది. రఘునాథపల్లి మండలం ఖిలాషపూర్‌కు చెందిన డాక్టర్ పగిడిపాటి సుగుణాకర్ రాజు 'స్టేషన్' బరిలోకి దిగడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. జనగామ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న 'పగిడిపాటి' తెలంగాణ రాష్ట్ర ఉద్యమం నాటి నుండి కీలక పాత్ర పోషిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో వచ్చే శాసనసభ ఎన్నికల్లో 'స్టేషన్' నుండి పార్టీ టికెట్‌నాశిస్తున్నారు. 'కడియం', 'తాటికొండ'ల రాజకీయాలతో విసిగిపోయిన బిఆర్ఎస్ పార్టీ శ్రేణుల్లో సైతం వారిద్దరిని పక్కనపెట్టి కొత్త అభ్యర్థికి అవకాశమిస్తే బాగుంటుందన్న చర్చ కూడా సాగుతుండడం గమనార్హం. బిఆర్ఎస్ కీలక నేతలతో తనకున్న సన్నిహిత సంబంధాలతో 'పగిడిపాటి' పార్టీ టికెట్ కోసం తీవ్రంగా కృషి చేస్తున్నారు. దీంతో వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ టికెట్ కోసం ముగ్గురు హెూరాహెూరీ తలపడుతున్నారు. మరి టికెట్ వరించెదెవరికో..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం రాజకీయాలు ఎప్పుడూ వేడెక్కుతూనే వుంటాయి. ఈ నియోజకవర్గం నుండి ఇద్దరు మాజీ డిప్యూటీ సిఎంలు ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యలిద్దరి మధ్య రాజకీయ వైరం వుండడం, వచ్చే ఎన్నికల్లో పార్టీ టికెట్ కోసం తీవ్రంగా పోటీ పడుతున్న విషయం విదితమే. ఇదిలావుంటే తాజాగా ధర్మసాగర్ మండలం జానకిపురం సర్పంచ్ నవ్య నేరుగా లైంగిక వేధింపుల ఆరోపణలు ఎమ్మెల్యే రాజయ్యపై చేయడం రాజకీయ దుమారాన్ని సృష్టించింది. ఈ వ్యవహారం 'తాటికొండ'ను ఇరుకునపెట్టింది. పార్టీ సీరియస్ కావడంతో ఎమ్మెల్యే డాక్టర్ టి. రాజయ్య నేరుగా సర్పంచ్ నవ్య ఇంటికి వెళ్లి క్షమాపణ చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో నన్ను రాజకీయంగా అణిచివేయడానికే నాపై రాజకీయ కుట్ర చేశారని ఎమ్మెల్యే రాజయ్య 'కడియం'పై ఆరోపణలు చేశారు. ఈ విషయం పార్టీ అధిష్టానం దృష్టికి వెళ్లింది. ఈ వ్యవహారంపై పార్టీ నాయకత్వం సీరియస్‌గా వున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఇదిలావుంటే ఇప్పటికే నియోజకవర్గంలో బిఆర్ఎస్ రెండు వర్గాలుగా చీలి వుంది. ఈ ఇద్దరు నేతలు పరస్పర ఆరోపణలు చేసుకుంటుండడంతో అటు పార్టీ వర్గాలు, ఇటు ప్రజలు సైతం విసిగిపోయారు. ఈ క్రమంలో వీరిద్దరు కాకుండా కొత్త అభ్యర్థిని రంగంలోకి దించితే బాగుంటుందన్న అభిప్రాయాలు పార్టీలో వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో రఘునాథపల్లి మండలం ఖిలాషపూర్‌కు చెందిన డాక్టర్ పగిడిపాటి సుగుణాకర్‌రాజు వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో డాక్టర్‌ల జెఎసిలో 'పగిడిపాటి' చురుకైన పాత్రను పోషించారు. వివాదరహితుడు, విద్యావంతుడు, ఉద్యమకారుడు కావడంతో 'పగిడిపాటి'ని రంగంలోకి దించితే గెలుసు సులువవుతుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ విషయంలో ఇంటెలిజెన్స్ వర్గాలు సైతం క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయాలు సేకరించి నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇద్దరు మాజీ డిప్యూటీ సిఎంల ఆధిపత్య పోరుతో నియోజకవర్గంలోని పార్టీ నేతలు, కార్యకర్తలు విసిగిపోయారు. 'కడియం' అనుభవాన్ని జాతీయ రాజకీయాల్లో వినియోగించుకోవాలని సీఎం కేసీఆర్ భావిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతుంది. ఎమ్మెల్యే రాజయ్యపై వచ్చిన ఆరోపణలు, క్షేత్రస్థాయిలో వున్న వ్యతిరేకత నేపథ్యంలో ఆయన స్థానంలో కొత్త అభ్యర్థిని రంగంలోకి దించితే బాగుంటుందన్న ఆలోచనలో పార్టీ వుందన్న చర్చ పార్టీలో జరుగుతుంది.

ఉద్యమ నేపథ్యంతో రంగంలోకి..

ఉద్యమ నేపథ్యంతో ఈసారి 'స్టేషన్' బరిలో నిలవాలని డాక్టర్ పగిడిపాటి సుగుణాకర్‌రాజు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో డాక్టర్ల జెఎసిలో 'పగిడిపాటి' కీలక పాత్ర పోషించారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌కుమార్, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి టి. హరీశ్‌రావుతో 'పగిడిపాటి'కి సన్నిహిత సంబంధాలున్నాయి. ఈ క్రమంలో వచ్చే ఎన్నికల్లో పార్టీ టికెట్ విషయంలో అమీతుమీ తేల్చుకోవడానికి ఆయన సిద్దమవుతున్నారు. ప్రస్తుతం జనగామ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెం ట్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయన సతీమణి జనగామ మున్సిపాల్టీలో కౌన్సిలర్‌గా వున్నారు. బిఆర్ఎస్ ఆవిర్భావం నుండి 'పగిడిపాటి' చురుకైన పాత్ర పోషిస్తున్నారు. డాక్టర్ పగిడిపాటి సుగుణాకర్‌రాజు పార్టీ టికెట్ కోసం తీవ్రంగా పోటీ పడుతుండడంతో నియోజకవర్గంలో ముగ్గురు నేతలు తమ రాజకీయ భవిష్యత్తు కోసం హెూరాహెూరీగా తలపడుతున్నారు.

వేలేరు ఎస్సైగా డి హరిత బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-వేలేరు

వేలేరు పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా డి హరిత ఉగాది పర్వదినం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ సీపీ(పోలీస్ కమిషనర్) ఏవీ రంగనాథ్ ఉత్తర్వుల మేరకు అర్బన్ మహిళ పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా డి హరిత పనిచేసి బదిలీపై వేలేరు పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ప్రస్తుతం వేలేరు పోలీస్ స్టేషన్ ఎస్ఐగా పనిచేస్తున్న నవీన్‌కుమార్‌ను మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై డీ హరిత మాట్లాడుతూ... శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్‌శాఖ నిరంతరం పనిచేస్తుందని అన్నారు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని అన్నారు.

రైతులను అన్నివిధాలుగా ఆదుకుంటాం

- అధికారుల సర్వే నివేదికలు రాగానే పరిహారం అందిస్తాం
- రైతులకు భరోసానిచ్చిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



నవతెలంగాణ- తొర్రూర్ రూరల్

ఇది రైతు ప్రభుత్వమని, సీఎం కేసీఆర్ రైతుల పక్షపాతి అని, రైతుల కోసం దేశంలో ఎక్కడా లేనన్ని అభివద్ధి, సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తున్న ప్రభుత్వం అని, వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం ఉగాది పండుగ రోజు అని చూడకుండా నష్టపోయిన రైతుల పంటలను పరిశీలించారు. మండలంలోని హరిపిరాల కర్కాల గ్రామాల్లో నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ రైతులు నష్టపోకుండా చివరకు పంటలు కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఇలాంటి ప్రభుత్వం, ఈ ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న సీఎం కేసీఆర్ తప్పకుండా పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లిస్తారన్నారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లో అధైర్య పడాల్సిన పనిలేదు. వారికి అండగా ప్రభుత్వం ఉంటుంది. మేమంతా అన్నదాతలకు అండగా ఉంటాంమని పంటలు దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామన్నాని అన్నదాతకు భరోసానిచ్చారు. తీవ్రంగా పంట నష్టపోయిన ప్రాంతాలను పరిశీలిస్తున్న సందర్భంలో ఆయా రైతులను మంత్రి పరామర్శించి ఓదార్చారు. మంత్రిని చూసిన రైతులు బోరుమన్నారు. తమకు పరిహారం ఇప్పించాలని తీరని, తీవ్ర నష్టాలలో కూరుకుపోయిన తమకు అండగా నిలిచి ఆదుకోవాలని వారు విలపించారు. ఈ సందర్భంగా మంత్రి వారికి భరోసానిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకుంటుందని అన్నారు. ఇప్పటికే సీఎం కేసీఆర్ ప్రజా ప్రతినిధులను పంట నష్టాలను పరిశీలించాలని ఆదేశించారని, ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటూ తమతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి సూర్యనారాయణ, ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, జడ్పీ ఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్, ఆర్డిఓ రమేష్, తాసిల్దార్ నాగేంద్రర పసాద్ ,ఎంపీటీసీ వల్ల గోపమ్మ మల్లయ్య, మండల కో ఆప్షన్ నెంబర్ అంకుష్, అధికారులు నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు వరంగల్‌కు సీఎం కేసీఆర్ రాక



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

అకాల వర్షాలతో నష్టపోయిన పంటలకు పరిశీలించడానికి సీఎం కేసీఆర్ వరంగల్ జిల్లాకు నేడు(గురువారం) రానున్నారు. నర్సంపేట నియోజకవర్గం, దుగ్గొండి మండలంలో అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించనున్నారు. ఈ మేరకు వరంగల్ జిల్లా అధికారయంత్రాంగం సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదిలా ఉంటే మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలో సీఎం కేసీఆర్ పర్యటించే అవకాశం ఉన్నట్టు సమాచారం.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి

- ఏప్రిల్ 3న చలో ఢిల్లీ
- తెలంగాణ మత్స్య కారులు, మత్స్య కార్మిక సంఘం(టీఎంకేఎంకేఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి గొడుగు వెంకట్



నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులో మత్స్యకారులపై చూపుతున్న వివక్షను నిరసిస్తూ, దేశవ్యాప్త మత్స్య కారుల సమస్యలపై ఏప్రిల్ 3న చలో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద భారీ ఎత్తున మత్స్యకారుల మహా ధర్నా నిర్వహిస్తుందని, జిల్లా నుండి మత్స్య కారులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోడుగు వెంకట్ పిలుపునిచ్చారు. బుధవారం హన్మకొండ రామ్‌నగర్ లోని టీఎంకేఎంకేఎస్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు నిమ్మల విజేందర్ ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో వెంకట్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బడ్జెట్‌లో మత్స్య కారులకు లక్ష కోట్లు కేటాయించకుండా విఫలమైందన్నారు. దేశవ్యాప్తంగా మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై పట్టించుకోకుండా కార్పొరేట్లకు అన్ని రంగాలలో అవకాశాలు కల్పిస్తూ అనేక రాయితీలు ఇస్తూ పేదలకు ఇచ్చే సబ్సిడీలను రద్దుచేసి ప్రజలపై భారాలను మోపుతున్నదని అన్నారు. ఫలితంగా మత్స్యకారులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. దేశవ్యాప్తంగా మత్స్య వత్తిపై ఆధారపడి ప్రత్యక్షంగా మూడు కోట్ల మంది మత్స్యకారులు ఉపాధి పొందుతు న్నారన్నారు. దేశానికి కోట్లాది రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని మత్స్య సంపద ఎగుమతుల ద్వారా సంపాదిస్తున్న మత్స్యకారులకు 2023 బడ్జెట్‌లో కేవలం రూ.6వేల కోట్లు మాత్రమే కోటాయించడం అన్యాయమని అన్నారు. దేశవ్యా ప్తంగా మత్స్య పరిశ్రమ అభివద్ధి మత్స్యకారుల సంక్షేమానికి లక్ష కోట్లు కేటాయించాలని అన్నారు. 50 సంవత్సారాలు నిండిన మత్స్యకారులకు పింఛన్ ఇవ్వాలని అన్నారు. ఎన్‌సీడీసీ ద్వారా మత్స్యకారులకు మోటార్ సైకిళ్ళు, చేపల మార్కెట్లు నిర్మించాలని కోరారు. వత్తి ప్రమాదంలో మరణించిన పేదరికంతో వైద్యం చేయించుకోలేక సహజంగా మరణించిన మత్స్యకారులకు దేశవ్యాప్తంగా ఇన్సూరెన్స్, ఎక్స్ గ్రేషియో పాలసీ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో టీఎంకేఎంకేఎస్ జిల్లా నాయకులు నీల మల్లయ్య బొజ్జం స్వామి, పిట్టల రవి, నీలం మల్లయ్య, పవన్, లత, అరుణ, శ్రీలత, హిమబిందు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల్ని ప్రభుత్వం ఆదుకోవాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి



నవతెలంగాణ-గోవిందరావుపేట

వడగండ్ల వానతో నష్టపోయిన రైతుల్ని ప్రభుత్వమే ఆదుకోవాలని సీపీఐ(ఎం) ములుగు జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి అన్నారు. బుధవారం మండలం లోని గుండ్ల వాగు ప్రాజెక్టు కింద గత ఆదివారం రాత్రి కురిసిన వడగండ్ల వానకు గాలి దుమారానికి మండలంలోని సుమారు 200 ఎకరాల మామిడి తోట , వందలాది ఎకరాల వరి పైరు, మిర్చి దెబ్బతిన్నాయి. బుధవారం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో గుండవాగు ప్రాజెక్టు కింద నష్టపోయిన రైతుల పంట పొలాలు, మామిడి తోట పరిశీలించాఉరు. ఈ సందర్భంగా తుమ్మల వెంకటరెడ్డి మాట్లాడారు. గత ఆదివారం పడిన వడగండ్ల వానకు భూక్య మీటునాయక్ అనే రైతు మామిడి తోట చెట్లతో సహా కూలిపోయి కాయ కూడా మిగలలేదన్నారు. వరి కూడా వడగండ్లకు పచ్చి వడ్లు రాలిపోయినాయని పేర్కొన్నారు. అప్పటికే ఎకరాకు వరికి రూ.20,000, మిర్చికి లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టి పంట చేతికొచ్చే సమయానికి రైతులు అకాల వర్షంతో వడగండ్లవానతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు పర్యటించి నామమాత్రపు పరిశీలన చేపట్టారని అన్నారు. గుండ్ల వాగు ప్రాజెక్టు కింద ప్రతి రైతు పంట వ్యవసాయ శాఖ అధికారులు హార్టికల్చర్ అధికారులు పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు పంపాలని అన్నారు. లేదంటే భవిష్యత్తులో రైతుల సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి తీగల ఆదిరెడ్డి, పొదిళ్ల చిట్టిబాబు,గుండు రామస్వామి, సామ చంద్రారెడ్డి, భూక్య మిట్‌నాయక్, పాలిత్య బాలు, మూడు రాజునాయక్, మాలోత్ గాంధీ, అజ్మీర కొమ్మాలు, అజ్మీర దుర్గ, భూక్య మార్క్ తదితరులు పాల్గొన్నారు .

అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధి చేస్తాం

- మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు



నవతెలంగాణ-మల్హర్‌రావు

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధి చేస్తామని కాంగ్రెస్ పార్టీ జాతీయ కార్యదర్శి, కర్ణాటక రాష్ట్ర ఇంచార్జి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీదర్ బాబు అన్నారు. కర్ణాటక రాష్ట్రంలోని బెల్గాంలో సిపిఈడి మైదానంలో జాతీయ కాంగ్రెస్ అగ్ర, యువనేత రాహుల్ గాంధీ 'యువ క్రాంతి ర్యాలీ' సదస్సు బుధవారం జరిగింది. ఈ సందర్భంగా దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరై ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు రూ.2 లక్షల ఋణమాఫి,అడబిడ్డలకు రూ.500కే వంటగ్యాస్, ఇందిరమ్మ ఇంటికి రూ.5 లక్షల సాయం, ఇంట్లో ఇద్దరు వద్దులు ఉంటే వారికి రూ.5వేల పిన్సన్, మొదటి ఏడాది 2లక్షల ఉద్యోగాలు, స్వశక్తి మహిళలకు పావలా వడ్డీలకే రుణాలు, అమ్మహస్తం కింద రేషన్ దుకాణాల ద్వారా రూ.185కే నాణ్యమైన 9 నిత్యావసర సరుకులు అందిజేస్తామని తెలిపారు.

జర్నలిస్ట్ సారయ్యకు చల్లా పరామర్శ



నవతెలంగాణ - కాటారం

రోడ్డు ప్రమాదాన్ని గురై హన్మకొండ లోని అమత ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సీనియర్ జర్నలిస్ట్ కాటారం మనం రిపోర్టర్ నారుమళ్ళ సారయ్యను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కాటారం పీఏసీఎస్ చైర్మన్ చల్లా నారాయణరెడ్డి పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. సారయ్య పరిస్థితి గురించి డాక్టర్ ప్రభాకర్‌ని అడగి తెలుసుకున్నారు. వెంటిలేషన్ సౌకర్యానికి ఇబ్బందిగా ఉందని, పేషెంట్ పరిస్థితి సీరియస్ గా ఉందని తెలపడంతో హైదరాబాద్ నిమ్స్ హాస్పటల్ డైరెక్టర్ డాక్టర్ బీరప్పతో మాట్లాడి పేషంట్ కి వెంటిలేషన్ సౌకర్యం కల్పించి హాస్పిటల్‌లో జాయిన్ చేసుకోవాలని కోరారు. అనంతరం ఆయనను అంబులెన్స్ ద్వారా హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్ కు పంపించారు. సారయ్య త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

ఎంపీడీవో పరామర్శ

మనం దినపత్రిక రిపోర్టర్ సారయ్య రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై హాస్పిటల్ లో చికిత్స పొందుతుండగా బుధవారం మహాముత్తారం ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు పరామర్శించారు. సారయ్యకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. రెడ్ క్రాస్ సొసైటీకి స్టేట్ ఈసీ మెంబర్ ఈవి శ్రీనివాస్‌తో మాట్లాడి బ్లడ్ ఇప్పించారు. సారయ్య తొందర కోలుకోవాలని ఆకాంక్షించారు.

27, 28 తేదీల్లో చలో ఢిల్లీ...: శ్యాంబాబు



నవతెలంగాణ-గోవిందరావుపేట

ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టాలని ఈనెల 27 28వ తేదీన న్యూఢిల్లీ జంతర్మంతర్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమానికి మాదిగలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఎంఎస్‌పి ములుగు జిల్లా సీనియర్ నాయకులు మడిపల్లి శ్యాంబాబు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని పస్రా ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ మండల అత్యవసర సమా వేశం గ్రామ కమిటీ అధ్యక్షుడు తోకల రాంబాబు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా శ్యాంబాబు హాజరై మాట్లాడారు. ఎస్సీలను ఏబిసిడి వర్గీకరణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. మాదిగలు మేధావులు విద్యార్థి సంఘాలు యువత అధిక సంఖ్యలో పాల్గొని చలో ఢిల్లీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నేత పంగ శ్రీను,గడ్డం సారయ్య, నీలాల మల్లేష్, మడిపల్లి వెంకటేష్, ఎంఎస్‌పి మండల నాయకుడు అజ్మీర సమ్మయ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పను దర్శించుకున్న జిల్లా జడ్జీలు, ఎస్సై రామకృష్ణ దంపతులు



నవతెలంగాణ- కోల్‌బెల్ట్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని శ్రీ చతుర్రూప ఆలయాన్ని, ఆలయ ప్రాంగణంలోని పరివార దేవతలను బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా జడ్జి నారాయణ బాబు దంపతులు, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి రాంచందర్‌రావు శుకృత్‌నామ సంవత్సరం ఉగాది పర్వ దినాన్ని పురస్కరించుకుని దర్శించుకున్నారు. భూపాలపల్లి పట్టణ ఎస్ఐ రామకృష్ణ దంపతులు వారి వివాహ వార్షికోత్స వాన్ని, ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని దేవతా మూర్తులను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు బండారి రమేష్, కమిటీ సభ్యులు,ఆలయ అర్చకులు శివ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించి జిల్లా న్యాయమూ ర్తులను, ఎస్సై దంపతులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు గెద్దాడ రాము, సూర రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవాస్థానం వేద పండితులు బైకుంఠ పాండాకు ఉగాది పురస్కారం

నవతెలంగాణ-మహదేవపూర్

హైద్రాబాద్ రవీంద్ర భారతిలో దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి చేతుల మీదుగా బుధవారం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవాస్థానం వేద పండితులు బైకుంఠ పాండా(పండిట్ జీ) ఉగాది పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈవో మహేష్, చైర్మన్ లింగంపల్లి శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు, దేవస్థానం సిబ్బంది, అర్చకులు పాండాను అభినందించారు.

సిద్ధేశ్వరాలయంలో పంచాంగం శ్రవణం



నవతెలంగాణ-మహాదేవపూర

మహదేవపూర్ మండలంలోని టాస్కర్ కాలనీలో సిద్దేశ్వర ఆలయం లో బుధవారం ఉగాది పురస్కరించుకుని వేద పండిత్తులు పంచాంగ శ్రవణ పఠనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు గొర్రె బాపు, సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.





ఉత్సాహంగా ఉగాది సంబరాలు

నవతెలంగాణ-మల్హర్‌రావు

మండలంలో అన్ని గ్రామాల్లో ఉత్సాహంగా ఉగాది పండుగ సంబరాలు బుధవారం జరిగాయి. ప్రజలకు అత్యంత ప్రీతి పాత్రమైన ఉగాది పర్వదిన శ్రీప్లవనామ సంవత్సరానికి వీడ్కోలు పలికి శుభకృత్ సంవత్సరానికి స్వాగతం పలికి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పల్లెల లోగిళ్ళలో పచ్చదనం,రైతన్నలు ఏరువాక ప్రారంభించారు. ఆరు షడ్రుచులతో పచ్చడి,పిండి వంటకాలు, వేగువజామునే మహిళలు నిద్రలేచి తమ ఇంటి ఎదుట వాకిళ్ళు శుభ్రం చేసి రంగురంగుల ముగ్గులతో అలంకరించారు.(పతి ఇంట్లో పచ్చని మామిడి తోరణాలు, రంగురంగుల పూలదండలు వెల్లివిరుశాయి. పిల్లలు, పెద్దలు తెలుగు సాంప్రదాయం వెల్లివిరిచేలా తెలంగాణ సాంస్కృతిని చాటేలా నూతన దుస్తులు ధరించి సందడి చేశారు. ఉదయం ప్రతి ఇంట్లో ఆరు రకాల రుచులతో ఉగాది పచ్చడి చేసుకొని అరగించారు. వేకువజామున పిల్లలు, పెద్దలు నువ్వుల నూనెతో తలంటుకొని స్నానాలు ఆచరించి కంకణాలు ధరించి కొత్త పాత్రలో కొంగొత్త మామిడి కాయలు, కొత్త చింతపండు, కొత్త బెల్లం, వేప పూవు, ఉప్పు,కారంతో కలిసి నోరూరించే ఉగాది పచ్చడి తాగారు.

గోవిందరావుపేట : షడ్రుచుల పచ్చడితో మండల వ్యాప్తంగా ఉగాది పండుగను బుధవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గడపలకు వాకిలికి మామిడి తోరణాలను కట్టి కంకణాలు ధరించారు. అనంతరం తీపి పులుపు వగరు కారం చేదు ఉప్పు ఆరు రకాల రుచులతో ఉగాది పచ్చడి, తదితర పిండి వంటలు చేసుకున్నారు. అనంతరం ఆయా గ్రామంలోని దేవాలయాల ప్రాంగణాల వద్ద అర్చక స్వాములు పంచాంగ శ్రవణం చదివి వినిపించారు. మండలంలోని పస్రా రామాలయంలో ప్రధాన అర్చక స్వాములు రంగాచార్యులు పంచాంగ శ్రవణం చదివి వినిపించారు.

ఘనంగా ఉగాది వేడుకలు

మహాదేవపూర్ : మండల కేంద్రం తోపాటు కాళేశ్వరం, ఎలికేశ్వరం, అంబటిపెల్లి, మందరగిరి వెంకటేశ్వర స్వామి అన్ని గ్రామాల్లో ఉగాది పం డుగ వేడుకలు ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. స్నానాలాచరించి దేవాల యంలో సందర్శకులు గోదా వరినదిలో ప్రత్యేక పూజలు చేశారు.

ఉగాది శుభాకాంక్షలు : : ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు



మల్హర్‌రావు : మంథని నియోజకవర్గ ప్రజలకు, ఆత్మీయులైన కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులందరికీ మంథని ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్ బాబు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ శోభకృత్ నామ సంవత్సరంలో అంత శుభాలు కలగాలని, పాడి, పంటలు బాగ పండాలని,ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ చేదు అనుభవాలని మర్చిపోతూ ఆత్మీయత అనుబంధాల్ని పెంచుకుంటూ ఉగాది పర్వదిన శుభ సందర్భంలో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కోరారు.

ఉగాది శుభాకాంక్షలు : అజ్మీర ప్రహ్లాద్



గోవిందరావుపేట : ఉగాది పండుగ పర్వదినాన అజ్మీరా ప్రహ్లాద్ మండల ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం మండలంలోని చల్వాయి గ్రామంలో కార్యకర్తలను కలిసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. తెలుగు నూతన సంవత్సరంలో ఎలాంటి వైశ్యామ్యాలు లేకుండా మంచి స్నేహంగా కొనసాగాలని కార్యకర్తలకు సూచించారు. శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి తిరిగి వస్తున్న క్రమంలో చల్వాయిలు కార్యకర్తలను కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపి వారిలో నూతన ఉత్సాహాన్ని నింపారు. భూ రెడ్డి మధుసూదన్ రెడ్డి మీసారథి చుక్క గట్టయ్య మీసా రవి ధరావత్ రంజిత్ చాపల సోమిరెడ్డి రమేష్ దర్శనాల సంజీవ గూడూరు శ్రీనివాసరావు న్యాయం దేవి రెడ్డి చాపల ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పచ్చడి పంపిణీ

మహాదేవపూర్ : మహాదేవపూర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం సర్పంచ్ శ్రీపతిబాపు ఆధ్వర్యంలో శోభకృత్ నామ సంవత్సర ఉగాది ఉత్సవాల సందర్భంగా ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. శోభకృత్ నామ సంవత్సరంలో గ్రామానికి అంతా శుభమే చేకూరాలని సర్పంచ్ ఆకాంక్షించారు. ఉపసర్పంచ్ సల్మాన్ ఖాన్,వార్డు సభ్యులు కొక్కు మీనా, పోత రామకష్ణ,సిరంగి రవీందర్,మాజీ కాళేశ్వరం దేవస్థాన ఛైర్మెన్ పోత వెంకటస్వామి,జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ వెన్నంపల్లి మహేష్,వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్ ఇబ్రహీం ఖాన్,నాయకులు కారెంగుల బాపురావు, అలీం ఖాన్,మెరుగు శేఖర్, మెరుగు లక్ష్మణ్,రెవెల్లి రాజశేఖర్,చిలుక రమేష్, చకినారపు చందు,చింతకుంట్ల సతీష్,అన్వర్ ఖాన్,గ్రామస్తులు పాల్గొన్నారు.



గృహలక్ష్మీ పథకం అమలుకు సన్నాహాలు !

- ఎదల్లో చిగురిస్తున్న ఆశలు

నవతెలంగాణ-మల్హర్‌రావు

గృహలక్ష్మీ పథకం నిరుపేదలకు వరంగా మారనుంది. సొంత జాగా ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం రూ.3లక్షల ఆర్థిక సాయం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో పేద మధ్యతరగతి వర్గాల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి. ప్రభుత్వం ఇచ్చే సొమ్ము కొంతే అయినప్పటికీ దానికి మరికొంత జమచేసుకొని ఇల్లు కట్టుకోవచ్చన్న అభిప్రాయం వారిలో వ్యక్తమవుతుంది. ప్రభుత్వ నిర్ణయంతో మంథని నియోజకవర్గానికి 3వేల మందికి లబ్ది చేకూరనుంది. ఇల్లు లేని నిరుపేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం 2015లో డబుల్ బెడ్రూం ఇళ్ల పథకం ప్రారంభించింది. ఎనిమిదేళ్ల గడుస్తున్నా కేటాయించిన ఇళ్ళన్ని నిర్మాణానికి నోచుకోలేదు.మండలంలో కొయ్యూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రాఘవపల్లిలో 40 డబుల్ బెడ్రూమ్ ఇల్లు మంజూరై ప్రగతిలో ఉన్నాయి.మల్లారం దుబ్బపేట గ్రామాల్లో ప్రపోజల్ పెట్టిన ఆచరణకు నోచుకోలేదు. మండలంలో అర్హులు వందల్లో ఉన్న సొంతిటి కల అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. దీంతో ఇల్లు లేని నిరుపేదలు ఆందోళన చెందుతున్నారు. ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన గృహలక్ష్మీ పథకం నిరుపేదల్లో ఆశలు నింపుతోంది. ఈ పథకంతోనైనా ఒక గూడు నిర్మించుకుందామని వారంతా ఎదురు చూస్తున్నారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు త్వరలో విడుదల కానున్నట్లుగా తెలుస్తోంది.

తెలంగాణ గౌడ కల్లుగీత వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షులుగా వెంకట్రాజంగౌడ్

నవతెలంగాణ- కాటారం

తెలంగాణ గౌడ కల్లు గీత వత్తిదారుల సంఘం జిల్లా అధ్య క్షులుగా అరిగెల వెంకట్రాజం గౌడ్ నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు ఆయిలి వెంకన్న గౌడ్ తెలిపారు. ఇప్పటివరకు జిల్లా అధ్యక్షులుగా కొనసాగుతున్న మారుగోని శంకర్ గౌడ్ ను రాష్ట్ర కమిటీ లోకి తీసుకున్నట్లు తెలిపారు. కళ్ళు గీత వత్తుదారులను ఆర్థికంగా, రాజకీయంగా, చైతన్యపరిచి సామాజిక న్యాయం పై పోరాడాలని ఆయిలి వెంకన్న కోరారు. జిల్లా అధ్యక్షులుగా నియమితులైన అరిగెల వెంకట్రాజంగౌడ్ విలేకరులతో మాట్లాడారు. తన నియమాకానికి సహకరించిన గౌడ సంఘం నేతలకు కతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపేతానికి కషి చేయడంతోపాటు గౌడ కులస్తుల హక్కుల సాధనకు ఉద్యమిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం రాష్ట్ర నాయకులు రవితేజ గౌడ్, సత్యనారాయణ గౌడ్, గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం దేవాలయంలో కవి సమ్మేళనం, పంచాంగ శ్రవణం

నవతెలంగాణ-మహాదేవపూర్

మహాదేవపూర్ మండలంలోని శ్రీ కాళేశ్వరం ముక్తేశ్వర దేవాలయంలో బుధవారం ఉగాది పండుగ పురస్కరించుకొని కవి సమ్మేళనం నిర్వహించారు. కాళేశ్వరం చెన్నూరు కాటారం ప్రాంతాల నుండి కవులు కళాకారులు పాల్గొని కవిత్వాలు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ మాడుగుల భాస్కర శర్మ అధ్యక్షత వహించగా కవి గడ్డం లక్ష్మయ్య సమన్వయకర్తగా వ్యవహరించారు. అనంతరం కవులు కళాకారులను ఘనంగా సన్మానించారు. అనంతరం కాళేశ్వరం ముక్తేశ్వర దేవాలయంలో కవులు పండితులు పంచాంగ శ్రవణ పఠనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి మహేష్, ఆలయ చైర్మెన్ లింగంపల్లి శ్రీనివాసరావు, కాళేశ్వరం ఎంపీటీసీ రెవెల్లి మమతా-నాగరాజు, కాళేశ్వరం గ్రామ సర్పంచ్ వెన్నపు రెడ్డి వసంత-మోహన్ రెడ్డి ఆలయ ధర్మకర్తలు, ఆడప సమయ్య, కామిడి రామ్ రెడ్డి, కలికోట దేవేందర్, శ్యామ్ సుందర్ దేవుడా, కుంభం పద్మా, ప్రజా ప్రతినిధులు, డైరెక్టర్లు, కవులు కళాకారులు, దేవస్థానం ప్రస్తుత డైరెక్టర్లు, మాజీ డైరెక్టర్లు దేవస్థానం సిబ్బంది, పండితులు పాల్గొన్నారు.



సీబీఐతో విచారణ జరిపించాలి : బీఎస్పీ

నవతెలంగాణ - కాటారం

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో పేపర్ లీకేజ్ ఘటనపై సీబీతో విచారణ చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబ సభ్యులు రాష్ట్రంలో ఉన్న 30 లక్షల నిరుద్యోగులకు సమాధానం చెప్పాలని బీఎస్పీ కాటారం మండల అధ్యక్షులు బొడ్డు రాజబాబు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం పర్యవేక్షణ లేకపోవడం వల్లనే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ లో పేపర్ లీకేజ్ జరిగింది అని బొడ్డు రాజబాబు ఆరోపించారు. జరిగిన తప్పుల కప్పిపుచ్చుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో పని చేసే సిట్ కు కేసును అప్పచెప్పి లీకులు చేసినవారిని కాపాడే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. తక్షణమే కేసును సిబిఐకి అప్పచెప్పి రాష్ట్ర ప్రభుత్వం తన చిత్త శుద్ధి నిరూపించుకోవాలని కోరారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా సరే కఠినంగ శిక్షించి,గ్రూప్ 1 పరీక్ష వ్రాసిన ప్రతి అభ్యర్థికి ప్రభుత్వం వెంటనే కోటి రూపాయల నష్టపరిహారాన్ని అందించాలని డిమాండ్ చేసారు. పేపర్ లీక్ సమస్య ను మొదటగ బీఎస్పీ పార్టీ వెలుగులోకి తెచ్చిందని ఆయన తెలిపారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ ఆమరణ నిరాహార దీక్ష పోరాట ఫలితంగ ప్రభుత్వం నాలుగు గంటల్లో దిగి వచ్చి పరీక్షలను రద్దు చేసిందని అన్నారు. నిరుద్యోగులకు తమ పార్టీ అండగా ఉండి పోరాటం చేస్తుందని తెలిపారు. టీఎస్పిఎస్సి చైర్మన్ జనార్దన్‌రెడ్డిని విధులనుండి తొలగిం చాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీ వ్యవహారంలో ఒకరిని కూడా విడిచిపెట్టకుండా చట్టరీత్యా చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2 హన్మకొండ,వరంగల్, జయశంకర్, ములుగు, జనగామ, మహబూబాబాద్
గురువారం 23 మార్చి 2023

బుల్లెట్ బండి నడిపిన ఎంపీ కవిత



చిన్నగూడూరు : ఉగాది పర్వదినం సందర్భంగా ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ స్వగహంలో ఉగాది వేడుకలను జరుపుకున్నారు. సాయంత్రంవేళ వాకింగ్ చే స్తుండగా రాయల్ ఎన్‌ఫీల్డ్ బండి ని సరదాగా కాసేపు నడిపారు. ఉగాది సందర్భంగా జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ప్రతీ కుటుంబంలో ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని కోరారు.

సీఎం సారూ..పరిహారం అంతేనా..?





ధీమాలేని పంట..శాస్త్రీయ సాయమే భరోసా..

వెంటాడుతున్న అకాల వర్షాలు..ప్రతి యేటా నష్టాలే..

ప్రతి రైతు ఇంటా 'పంట' రోధన..

నేటి సీఎం కేసీఆర్ పర్యటనపై చిగురించిన ఆశలు..

నవతెలంగాణ-నర్సంపేట

ప్రతి యేటా అకాల, వడగండ్ల వానలు చేతికొచ్చే పంటను తుడిచిపెట్టుకపోతున్నాయి..ఆరుగాలం కష్టపడి లక్షలాదిగా పెట్టుబడులు పెట్టి పండించిన పంట చేజారుతూ రైతు కుటుంబాల్లో కన్నీరే మిగుల్చుతుంది.. 2018, 2020, 2022 ఈ యేడాది వరసగా అకాల, నిరవధిక వర్షాలు రైతును నిండా ముంచాయి.. ఇంతటి నష్టాల ఊబిలో చిక్కుకుంటుండగా ఆపదలో ఆదుకొనేందుకు ప్రభుత్వాలకు మనసు రావడం లేదనే రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల బృందాలతో సర్వేలు చేసి అంచనాలు రూపొందించడం వరకే ప్రభుత్వం సరిపెట్టుకొంటూ వస్తుందని రైతులు వాపోతున్నారు. నష్టంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మల్లగుల్లాలు పడుతున్నాయనే విమర్శలు వెలువడుతున్నాయి. జాతీయ ప్రకృతి వైపరీత్యాల చట్టం (డిజెస్టర్ మేనేజ్‌మెంట్ డివిజన్, జీవో 2, 2015) ప్రకారం 60:40 నిష్పత్తిలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నష్ట పరిహారం చెల్లించాల్సి ఉంది. కేంద్రం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి సహాయం ప్రకటన వెలువడలేదు. ఎట్టకేలకు 2022 జనవరి 11న వడగండ్ల వాన వల్ల దెబ్బతిన్న పంటలపై రాష్ట్ర ప్రభుత్వం నష్ట పరిహారం విడుదల చేసింది.పంట నష్టం అంచనాల్లో డొల్లతనమే కన్పిస్తుంది. అంచనాల్లో శాస్త్రీయతో లేకుండా పోయింది. పంటపై పెట్టిన పెట్టుబడులు, పంటదశను పరిగణంలోకి తీసుకోకుండా నివేదిస్తున్న అంచనాల వల్ల రైతులకు పెద్దగా ఒరిగేదేమి లేదనే అభిప్రాయం వ్యక్తమౌతుంది. తాజాగా విడుదల చేసిన జీవో 42 ద్వారా వరి, మిరప, పత్తి పంటలకు హెక్టార్‌కు రూ.13,500లు, మొక్కజొన్నపై రూ.8,333 మాత్రమే చెల్లించనుంది. నియోజకవర్గంలోని 6 మండలాలతో పాటు గీసుకొండ, సంగెం, రాయపర్తి మండలాల్లోని 91 గ్రామాల్లో 13,234 ఎకరాల మిర్చి పంటపై 12565 మంది రైతులకు రూ.7 కోట్ల 14లక్షలపైగా నష్టపరిహారం విడుదలైంది. డివిజన్‌లోని ఇందులో కేంద్రం వాటా లేదని మొత్తాంగానూ రాష్ట్ర ఖజానా నుంచే రైతులకు చెల్లిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కేంద్రం విడుదల చేసినా రైతుకు మాత్రం ఇంతే ఇచ్చే అవకాశం ఉంది. ఈ నెల 18న రాత్రింభవళ్లు పడిన వడగండ్ల వాన వల్ల మొక్కజొన్న, మిరప, అరటి, కూరగాలు పంటలు దిగుబడులు చేతికందే దశలో దెబ్బతిన్నాయి. అనేక మంది ఇండ్లు ధ్వంసమై నిరాశ్రులయ్యారు. వేలాదిగా విద్యుత్ స్థంభాలు విరిగాయి. ట్రాన్స్‌ఫార్మర్‌లు కాలిపోయాయి. పలు గ్రామాల్లో ఇప్పటికీ విద్యుత్ సరఫరా నిలిచి అంధకారంలో ఉండిపోయాయి.పంట నష్టంపై అధికారులు ప్రిమిలరీ అంచనాలు రూపొందించారు.

ఉమ్మడి జిల్లాలో 11లక్షల ఎకరాల పైగా వివిధ పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఒక్క నర్సంపేట డివిజన్‌లోనే 54 వేల ఎకరాలలో పంట నష్టం వాటిల్లినట్లు తెల్సుతుంది. ఈ సారి చేపడుతున్న సర్వేల్లోనూ శాస్త్రీయత లేదనే చెప్పాలి. కిందటేడాది ప్రకటించినట్లే పరిహారం ఇస్తే రైతులకు ఊరట అంతంతా



మాత్రమేనే చెప్పాలి. ఎకరాకుమిరప పంటపై రూ.1.50లక్షల పైగా రైతులు సాధారణ పెట్టుబడే అవుతుంది. ఇక వింత వైరస్‌ల నుంచి పంటను దక్కించుకొనేందుకు రెండింతల పెట్టుబడి పెట్టాల్సి వస్తుందని రైతులు తెలిపారు. వరి, మొక్కజొన్న పంటలపై పెట్టుబడుల భారం విపరీతంగా పెరిగింది. ఇన్ని కష్టాలు, అప్పులు తెచ్చి పెట్టి పంటను దిగుబడులు వచ్చే కాపాడుకుంటుండగా ప్రకృతి వికృతి రూపంలో విలయతాండవం చేస్తూ చేతికొచ్చే పంటను తుడిచి పెట్టుకపోతూ నిండా ముంచుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితిల్లో దినదినా వ్యవసాయంపై నమ్మకం సన్నగిల్లు పోతుందని వాపోతున్నారు. ప్రభుత్వం భరోసానిస్తేనే తప్పా ఇకపై పంటలను సాగు చేయలేమని దాసరిపల్లికి చెందిన ముగ్ధం రాజేందర్ అనే రైతు అభిప్రాయం వ్యక్తం చేశాడు. కాగా పంటలను సందర్శించడానికి నేడు సీఎం కేసీఆర్ పర్యటనపై రైతుల్లో కొత్త ఆశలు రేకిత్తిస్తుంది. ఇప్పటికైనా శాస్త్రీయ అంచనాలతో ప్రభుత్వం నష్ట పరిహారాన్ని పెంచిఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

నేడు సీఎం కేసీఆర్ పర్యటన..దెబ్బతిన్న పంటల పరిశీలన



నవతెలంగాణ-నర్సంపేట

ఈ నెల 18న పడిన వడగండ్ల వానలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించేందుకు నేడు సీఎం కేసీఆర్ నర్సంపేట, పర్కాల నియోజకవర్గంలోని పలు గ్రామాలను సందర్శంచనున్నారు.ఈ మేరకు కేసీఆర్ పర్యటపై నర్సంపేట, పర్కాల ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, చల్లా ధర్మారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. బుధవారం దుగ్గొండి మండలంలోని అటవీ రంగాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను అధికారులు, పోలీసు అధికారులతో కలిసి సందర్శించారు. హెలికాప్టర్‌లో సీఎం కేసీఆర్ వచ్చి అటవీ రంగాపురంలో పంటలను పరిశీలించి అక్కడి నుంచి వాహనంలో గిర్నిబావి మీదిగా కొమ్మాల, పల్లర్లగూడ, వంజర్లపల్లి , మచ్చాపురం, గంగదేవిపల్లి మీదిగా కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్కుకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు వెళ్లనున్నారు.ఈ సందర్భంగా పోలీసు భందో బస్తు చర్యలను డీసీపీ కర్ణాకర్, ఏసీపీ సంపత్‌రావు తదితర పోలీసు అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

టీఎన్‌జీఓ భవన్‌లో పంచాంగ శ్రవణం

నవతెలంగాణ-సుబేదారి

టీఎన్‌జీఓస్ భవన్ లో పంచాంగ శ్రవణం నిర్వహించామని టీఎన్‌జీఓస్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ ఉద్యోగులందరికీ ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఉద్యోగులకు అనునిత్యం అందుబాటులో ఉంటూ సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కొరకు కషి చేస్తానని అన్నారు. ఉద్యమం నుంచి మొదలుకొని ఇప్పటివరకు కూడా ఉద్యోగులు పెన్షనర్లు తనకు అండదండలు అందిస్తున్నారని అన్నారు. ఈ తెలుగు నూతన సంవత్సరంలో ఉద్యోగుల పెన్షనర్ల కుటుంబ సభ్యులందరూ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు.

జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్ మాట్లాడుతూ తెలుగు వారి నూతన సంవత్సరము సందర్భంగా ఉద్యోగులందరికీ మంచి జరుగలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ సంవత్సరం కేంద్ర సంఘం అధ్యక్షులు ఆకుల రాజేందర్, ప్రధాన కార్యదర్శి రాయి కంటి ప్రతాప్ నాయకత్వంలో మనం నూతన పి ఆర్ సి సాధించుకుంటామని మన సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని అన్నారు. ఈ సందర్భంగా ప్రకాశం పంతులు ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం జరిగింది.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బైరీ సోమయ్య, అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరు వేణు గోపాల్,కోశాధికారి పనికెల రాజేష్,కేంద్ర సంఘం ఉపాధ్యక్షుడు శనిగరపు శ్యామ్ సుందర్,వరంగల్ అధ్యక్షులు గజ్జెల రామ్ కిషన్,భూపాలపల్లి అధ్యక్షులు బురుగు రవి,ములుగు అధ్యక్షులు జ్ఞానేశ్వర్, పేన్షనర్స్ అసోసియేషన్ హనుమకొండ అధ్యక్షులు సర్వర్ హుస్సేన్,వరంగల్ అధ్యక్షులు మల్లికార్జున్,ఎస్ అర్ జీ ఎస్ అధ్యక్షులు వెంకట్రం రెడ్డి,డ్రైవర్స్ అసోసియేషన్ కార్యదర్శి గోపాల్, ఉమ్మడి వరంగల్ జిల్లా టిఎన్ జీ ఓస్ నాయకులు గజే వేణు గోపాల్, హరి కష్ణ,నాగరాజు, మోయిజ్, బింగి సురేష్, రామ్ ప్రసాద్,ఉదయ్ భాస్కర్,రాజేష్ ఖన్నా,లక్ష్మి ప్రసాద్,చీకటి శ్రీనివాస్,ఆకుల రాజమౌళి, రాజీవ్, కష్ణ, భరత్, శ్యామ్, అనూప్, ప్రణయ్,అజీమ్,రమేష్,గోవర్ధన్,గోపి కష్ణ, ప్రవీణ్, శ్రీనివాస్, గౌతమ్,మల్లేశం,శివ తదితరులు ఉగాది వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.



సురక్షితమైన నీరు, పారిశుద్ధ్యంపై అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-మట్టెవాడ

31వ ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా స్థానిక ఏ వి వి కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కొడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో" నీటి పొదుపు మరియు పారిశుధ్యం "పై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాలంటీలను ఉద్దేశించి కోడిమాల శ్రీనివాసరావు మాట్లాడుతూ మన చుట్టూ నీరు 75% ఉన్న మనకు అందుబాటులో మూడు శాతం మాత్రమే వివిధ రూపాల్లో అందుబాటులో ఉన్నాయని కావున నీటిని పొదుపు చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని ,తద్వారా భావితరాలకు మంచి నీటిని అందించిన వారు అవుతామని ఈ సంవత్సరము యు .ఎన్ .ఓ వారు పరిశుభ్రమైన నీరు మరియు పారిశుధ్యం పై ప్రజల్లో అవగాహన , చైతన్యవంత మైన కార్యక్రమాలు చేయాలని సూచించారని అన్నారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ వాలంటీర్లు విష్ణు, ఇమ్రాన్, జగదీష్, ప్రమోద్, ఎండి సమీర్, దీపక్, ఉత్తేజ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి ఏనుగల్లులో సత్తెమ్మ జాతర

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని ఏనుగల్లు గ్రామంలో ప్రతియేటఉగాది పండుగ సందర్భంగా 3 రోజుల పాటు జరిగే సతెమ్మ తల్లీ జాతర ను విజయవంతం చేయాలని సర్పంచ్ ధంశెట్టి సంధ్యారాణి నర సింగం పిలుపునిచ్చారు.బుధవారం జాతర లో బాగంగా గుడి చుట్టూ ఎడ్ల బండ్లు తిరిగాయి.నేడు మొదటి రోజు జాతర ప్రారంభం కావున భక్తులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయగలరని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బీ ఆర్ ఎస్ పార్టీ యువత అధ్యక్షుడు గూడ నరేందర్ వర్మ, మాజీ ఉప సర్పంచ్ గుండారపు సతీష్ రావు, వార్డు సభ్యులు తొర్రి లక్ష్మణ్ యాదవ్ యూత్ నాయకులు నల్లపు రంజిత్ పాల్గొన్నారు.

సీఎం పర్యటన అధికారిక ప్రకటనకు అధికారుల ఎదురు చూపులు





ముదిరాజ్ కమ్యూనిటీహాల్ నిర్మాణానికి ప్రొసీడింగ్ కాపీ అందజేత



నవతెలంగాణ-కాజీపేట

గ్రేటర్ వరంగల్ 45వ డివిజన్ తరాలపల్లిలో ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి ప్రొసీడింగ్ కాపీని గ్రామస్తులు, ముదిరాజ్‌కులసంఘ నాయకులకు బుధవారం బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ హన్మకొండ ప్రశాంత్‌నగర్‌లోని ఎమ్మెల్యేనివాసంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్ రావు,క్రాంతి కుమార్ డివిజన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యుడికి అభినందన



నవతెలంగాణ-కాజీపేట

తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యులుగా దర్శన్ సింగ్ నియమితులైన సందర్భంగా తోటి బాల్యమిత్రుడు 48వ డివిజన్ దర్గా కాజీపేటకు చెందిన బీఆర్ఎస్ ఎస్సీసెల్ నాయకులు ఇల్లందుల రాజు అలంకార్ జంక్షన్ గల దర్శన్‌సింగ్ నివాసంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

నత్తనడకన..'మిషన్ భగీరథ' పనులు..





నవతెలంగాణ-నర్సంపేట

2016 ఆగస్టు 6న సీఎం కేసీఆర్ ప్రకటించిన 'మిషన్ భగీరథ పథకం' మంచినీటికి పట్టణ ప్రజలు నేటికీ నోచుకోలేదు. ఇంటింటా శుద్ధి నీటిని సరఫరా చేయాలనే ప్రభుత్వ సంకల్పం ఏళ్ల గడిచినా ఇంకా నెరవేరలేదు. మిషన్ భగీరథ మంచినీరు ఇంటింటా అందిస్తామని ప్రభుత్వం చెబితే పట్టణ ప్రజలు సంబరపట్టారు. ఇక మాకిక కుళాయి మురికి నీటి కష్టాలు తప్పుతాయని ఆశించారు. ఇంజనీరు అధికారుల అలసత్వం..కాంట్రాక్టర్‌ల నిర్లక్ష్యం, పలు సాంకేతిక అడ్డంకులు..వెరసి పట్టణ ప్రజలకు నేటికీ మంచి నీటి సరఫరా దరి చేరలేదు.. మిషన్ భగీరథ పనులకు ఆది నుంచి అన్ని అడ్డంకులే ఎదురైతున్నాయి. ఇటీవల పైప్‌లైన్ పనులను జాతీయ రహదారి ఇంజనీరింగ్ అధికారులు నిలిపివేశారు. పట్టణంలోని 24 వార్డుల్లో 13,756 గృహాల్లోదాదాపు 40వేల మంది నివసిస్తున్నారు. మున్సిపాలిటీకి మిషన్ భగీరథ పథకం కింద ప్రభుత్వం రూ.48 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఇప్పటి వరకు సుమారు రూ.32 కోట్ల నిధులను ఖర్చుచేసినట్లు ఇంజరింగ్ అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కింద ఇప్పటి వరకు 85 శాతం పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. ఇంటింటానల్లాలను అమర్చలేదు..రోడ్లపై తవ్విన గుంతలకు మరమ్మత్తు చేపట్టలేదు. వివిధ శాఖల అధికారుల మధ్య సమన్వయలోపంతో మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఫలితంగా ఈ వేసవిలోనూ పట్టణంలో తిరిగి ఎప్పట్లాగే తాగునీటి ఎద్దడి సమస్య ఉత్పన్నమవుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా నిర్దిష్ట గడువులోపు పనులను పూర్తి అయ్యేలా ప్రభుత్వం, ఉన్నత ఇంజనీరు అధికారులు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పనుల్లో కొరవడిన వేగవంతం..కాంట్రాక్టర్‌ల ఇష్టారాజ్యం..

పట్టణంలో మిషన్ భగీరథ పథకం ప్రాజెక్టు పనులను పీఆర్‌జీ కన్‌స్ట్రక్షన్ కంపెనీ చేపడుతుంది. ఇంట్రా పైప్‌లైన్ పనులను, ట్యాప్‌లు అమర్చే పనులను, రోడ్ల మరమ్మత్తు పనులను ఈ కంపెనీ వేర్వేరు కాంట్రాక్టర్‌లకు అప్పగించింది. మల్లంపెల్లి రోడ్డు, అంబేద్కర్ సెంటర్ నుంచి పాకాల రోడ్డు, మహబూబాబాద్ రోడ్డు వైపున హైవే ఇంజనీరు అధికారులు పైప్‌లైన్ పనులకు ఇంకా అనుమతి ఇవ్వలేదు. మున్సిపల్ పలు రకాల పనులు ఇంకా అసంపూర్తిగానే ఉండి నీటి సరఫరా కాకుండా పోయింది.ఇదిలాఉంటే పైప్‌లైన్‌ల కోసం తవ్విన కందకాలతో రోడ్లన్ని అధ్వాన్నంగా మారాయి.ఇక అంతర్గత రోడ్లన్ని పాడయ్యాయి.నెలల తరబడినా ఇంకా మరమ్మత్తులు చేపట్టడం లేదు.రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతూ పలు

పాడైన రోడ్లకు మరమ్మత్తులు ఎప్పుడు..?
వివిధ దశలలో ట్యాంకుల నిర్మాణం
పైప్‌లైన్ పనులకు 'హైవే' అడ్డంకి..
వేసవిలో పొంచి ఉన్న నీటి ఎద్దడి..!
పట్టణ ప్రజలకు తప్పని తాగునీటి తిప్పలు

ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. తవ్విన కాంట్రాక్టర్ ఒకరు, మరమ్మత్తులు చేసేది మరొక కాంట్రాక్టర్ పనులు చేపట్టారు. ట్యాప్‌లు అమర్చే పని మొదలెట్టలేదు.ఈ పనులు చేయనిదే మరమ్మత్తులు చేయడం కుదరదని మరో కాంట్రాక్టర్ చేతిలెత్తేశాడు. ఈ వేసవిలోనూ మిషన్ భగీరథ మంచినీటి సరఫరా కలయేనా అంటూ పలువురు మహిళలు విస్తుపోతున్నారు. ఇప్పటికైన అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనులను వేగవంతం చేసి శుద్ధి నీటిని సరఫరా చేయాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నిర్మాణంలో ట్యాంకులు.. మెయిన్ పైప్‌లైన్‌కు అడ్డంకులు

పట్టణంలోని సర్వాపురం(కుమ్మరికుంట) మూడేండ్ల క్రితమే 500 కిలో లీటర్‌ల సామర్థ్యం కలిగిన ఓహెచ్ఆర్ ట్యాంకు నిర్మాణం పూర్తి చేశారు. శాంతినగర్‌లో 800 కిలో లీటర్‌ల ట్యాంకు, సాంఘీక సంక్షేమ గురుకులంలోని 1000 కిలో లీటర్‌ల ట్యాంకు స్లాబ్ వరకు నిర్మాణం పూర్తి అయింది. మున్సిపల్ కార్యాలయంలోని 600 కిలో లీటర్‌ల సామర్థ్యం కలిగిన ట్యాంకు నిర్మాణం పూర్తి దశకు చేరుకుంది. ఇదివరకే జెడ్పీ బాలుర పాఠశాలలో, బొందబడి ఆవరణలో, శాంతినగర్‌లో ట్యాంకులు ఉన్నాయి. పట్టణంలోని 24 వార్డుల్లో 7 జోన్‌లుగా పరిగణించారు. ఈ ఏడు ట్యాంకుల ద్వారా 13,756 గృహాలకు నల్లా నీటిని సరఫరా చేయాల్సి ఉంది.1,53,527 మీటర్‌ల పైప్‌లైన్ విస్తరణకు 1,31,362 మీటర్ మేరకు పైప్‌లైన్ పనులను పూర్తి చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.ఇంకా 22,165 మీటర్‌ల పైప్‌లైన్ పనులు చేయాల్సి ఉంది. హైవే అధికారులు ఇంకా ఇనుమతి ఇవ్వకపోవడం వల్ల 12,876 మీటర్‌ల పైప్‌లైన్ నిలిచిపోయింది.

మొత్తంగా 85.56శాతం పైప్‌లైన్ పనులు చేపట్టినట్లు అధికారులు చెప్పారు. 13,756 గృహాలకు గానూ 7,312 నల్లా పైప్‌లైన్‌లు వేశారు. ఇంకా ఇంటింటా నల్లాలను అమర్చాల్సి ఉంది. మరో 40రోజుల వ్యవధిలో పనులను పూర్తి చేయాలనే లక్ష్యాన్ని ఎంచుకున్నట్లు మున్సిపల్ ఏఈ శాంతి స్వరూప్ తెలిపారు.

అడుగడుగునా తవ్వకాలు.. పెండింగ్‌లో రోడ్ల మరమ్మత్తులు

పైప్‌లైన్ పనులకై ప్రధాన, అంతర్గత రోడ్లు, పక్కన తవ్వకాలు చేపట్టారు.మట్టిని పడ్చినా రోడ్లపై గుంతలు అట్లాగే ఉన్నాయి. దీనివల్ల బాటసారులు, వాహనాలపై వెళ్లే వారు పలు ప్రమాదాలను ఎదుర్కొన్నారు.17.5 కిలో మీటర్ల నిడివి కలిగిన రోడ్లను తవ్వినట్లు ఇంజనీరులు పేర్కొన్నారు. ఇందులో 3.293 కిలో మీటర్ల రోడ్లను మాత్రమే మరమ్మత్తులు చేసినట్లు చెప్పారు.ఇంకా 14.21 కిలో మీటర్‌ల మేరకు మరమ్మత్తులు చేయాల్సి ఉంది.

ఇదిలాఉండగా పట్టణంలోని ఇంటింటా నల్లా కనెక్షన్ ఇవ్వడానికి రోడ్లకు ఇరువైపుల పైప్‌లైన్ వేయాల్సి ఉంది. ఇందుకు భిన్నంగా ఒకే వైపున పైప్‌లైన్ వేయడం వల్ల మరో వైపు ఉన్న ఇండ్లకు నల్లా కనెక్షన్ కోసం రోడ్డును అడుగడుగునా పగల కొట్టారు. దీంతో ఇంకా రోడ్లన్నీ గుంతలు పడ్డాయి.పలు వార్డులలలో ఏకంగా సీసీ రోడ్లు అధ్వాన్నంగా మారాయి. కాంట్రాక్టర్ ఈ రోడ్లన్నింటిని శాశ్వత పద్ధతిలో పక్కగా మరమ్మత్తులు చేయాల్సి ఉంది.ట్యాంకుల నిర్మాణాలు, పైప్‌లైన్ పనులు పూర్తి అయితే తప్పా నల్లాలు బిగింపు, రోడ్ల మరమ్మత్తులు చేయలేమని ఏఈ తెలిపారు. ఏప్రిల్ 31 నాటికి పనులన్నీ పూర్తి చేయడానికి తగు చర్యలు చేపడుతామని మున్సిపల్ ఏఈ శాంతి స్వరూప్ తెలిపారు.

ట్రాఫిక్ చలాన్లతో బెంబేలెత్తిస్తున్న పోలీసులు



నవతెలంగాణ-వరంగల్

వరంగల్ నగరంలో అడుగడుగున ట్రాఫిక్ పోలీసులు అడ్డాలు వేసి రోడ్డు మార్గంలో వెళ్తున్న వాహనదారులను ఆపి హెల్మెట్,వివిధ సర్టిఫికెట్లు లేదన్నసాకుతో ట్రాఫిక్ నియంత్రణ చేసే కార్యక్రమాన్ని పక్కన పెట్టి నగరంలో చలాన్ల బాదుడు సర్వసాధారణమైపోతుంది. ఇరువైపుల వస్తున్న వాహనాలు ఆపడంలాంటి చర్యలతో ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని పలువురు అనుకుంటున్నారు. కొంతమంది పోలీసులు అధికారులు వాహనాన్ని చాటు మాటు గా ఎవ్వరికీ కనబడకుండా పెట్టుకొని రోడ్డుపైన నిలబడి వాహనదారులను ఆపిమరి చలాన్లు కొట్టి పంపిస్తున్నారు. ఇది ఏమిటి అని పలువురు వాహనదారులు అడిగితే అదిఅంతే అని కొంత మంది ట్రాఫిక్ పోలీసులు నిర్లక్ష్య సమాధానం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసరంగా అనారోగ్య పరిస్థితుల్లో ఆసుపత్రికి వెళుతున్న క్రమంలో చెప్పిన వినకుండా నిర్దాక్షిణ్యంగా వాహనాల తనిఖీలు, చాలన్ల పేరుతో కఠినంగా వ్యవహరించడంపట్ల పలు వాహనదారులు ఇది ఏమిటని అనుకునే వారులేకపోలేదు. వాహన దారులు ఆపే క్రమంలోఅకస్మాత్తుగా కొంతమంది ట్రాఫిక్ పోలీసులు వాహనాలకు ఎదురుగా రావడం వలన వాహనాలు ఆపే క్రమంలో వాహనదారులు వాహనం నియంత్రణ చేసుకోలేక ఎదురుగా వచ్చిన కానిస్టేబుల్ కు ప్రమాదం జరిగితే,లేదా వాహన దారులు కింద పడి ప్రమాదం జరిగిన బాధ్యత ఎవరు వహిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

జంక్షన్ల మధ్య ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా చూడాల్సింది పోయి చలాన్లబాదుడే లక్ష్యంగా పెట్టుకొని వచ్చిన ప్రతివాహనానికి చలాన్లు వేసి పంపిస్తున్నా రని ఆరోపణలు లేకపోలేదు. డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్, పొల్యూషన్ అని పలుకారణాలు చూపుతూ చలాన్లు వేయడం వలన వానదారులు రోడ్డుపైకి రావాలంటే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. కొంతమంది ట్రాఫిక్ పోలీసులు వాహనదారులు వెళ్తుంటే వెనుకనుండి ఫోటోలు తీసి మరి చలాన్లువేయాలనే ఉద్దేశంతో ఉంటున్నారా అనే అనుమానం వ్యక్తం అవుతున్నాయి. కానీ వరంగల్ పోస్ట్ ఆఫీస్ వరంగల్ బట్టల బజార్ కాశిబుగ్గ పోచమ్మ మైదాన్ వంటి పలుప్రాంతాల్లో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడితే కొంతమంది ట్రాఫిక్ పోలీసులు తమ సొంతపనుల నిమిత్తం, కొన్ని జంక్షన్లలో ఉండకుండా గాలికి వొదిలేసి ప్రక్కన ఉన్న షాపుల్లో కూర్చుని విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం,మరి కొంత మంది సెల్ ఫోన్లు చూస్తూ ఉంటున్నారే తప్ప ట్రాఫిక్ అంతరాయం కలిగినప్పుడు కనీసం బాధ్యతగా విధులు నిర్వర్తించడం లేదని పలువురు చర్చించుకుంటున్నారు. ఇలాంటి సంఘటలను చూస్తే కొంత మంది ట్రాఫిక్ పోలీసులు తీరు ఎప్పుడు మారుతుందో వాహన దారులు అనుకుంటున్నారు. ఏదేమైనాప్పటికీ ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా బాధ్యతను సక్రమంగా నిర్వర్తించా లని వాహనదారులు గుసగుసలాడుకుంటున్నారు.

ఇష్టానుసారంగా చలాన్లు వసూలు : యశ్వంత్, కాశీబుగ్గ

వాహనాన్ని బయటికి తీయాలంటే భయం వేస్తున్నది,అడుగడుగునా ట్రాఫిక్ పోలీసులు చలనాల పేరుతో బలవంతంగా వసూళ్లు చేస్తున్నారు.ఆరోగ్యం బాగా లేక ఆసుపత్రికి పోతున్నాం అనిన వినకుండా పెండింగ్ చాలన్లు కట్టాల్సిందే అని ట్రాఫిక్ పోలీస్లు అనడం చాలా బాధ అనిపించింది. ఒక దిక్కు ప్రాణం పోతుంది అంటే ట్రాఫిక్ పోలీసులు చలానలు కట్టి వెళ్లాలి అంటున్నారు. ఇప్పటికైనా ఆసుపత్రి కి వెళ్ళే వారికి కొంత సడలింపు ఇవ్వాలి.

ప్రతిభకు ఉగాది జాతీయ పురస్కారం



నవతెలంగాణ-ధర్మసాగర్

జన విజ్ఞాన వేదికలో క్రియాశీల కార్యకర్తగా పనిచేస్తూ పర్యావరణ పరిరక్షణలో తనరచనలతో జనజాగతం చేస్తున్న ధర్మప్రకాష్ జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. బుధవారం ఎన్జీవోస్ నెట్వర్క్ సౌజన్యంతో విశ్వ శ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఉగాది జాతీయ పురస్కారాల వితరణ సమావేశంలో కళా ప్రపూర్ణ డాక్టర్ బిక్కి కష్ణ, పాఠశాల విద్య డిప్యూటీ డైరెక్టర్ గురుమూర్తి చేతులమీదుగా ధర్మసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న ధర్మ ప్రకాష్ ఉగాది జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న వ్యక్తులకు ఈ అవార్డులు అందజేయగా జన విజ్ఞాన వేదికలో క్రియాశీల కార్యకర్తగా పనిచేస్తూ పర్యావరణ పరిరక్షణలో తన రచనలతో జనజాగతం చేస్తున్న ధర్మప్రకాష్‌కు అవార్డు అందజేస్తున్నట్లు గురుమూర్తి తెలియజేశారు. ఈ సందర్భంగా ధర్మ ప్రకాష్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు నా జీవం ఉన్నంతవరకు నా రచనలతో పాటుగా, ప్రతి వ్యక్తినీ మేలుకొలుపే విధంగా నా వంతు కషి చేస్తానని అన్నారు. నన్ను గుర్తించి, నాకు ఈ పురస్కారాన్ని అందించడం చాలా సంతోషకరంగా సంతప్తిగా ఉందన్నారు. కార్యక్రమంలో నరసింహప్ప, కస్తూరి శ్రీనివాస్, జీవన్ లాల్ అవాడీయా, తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, డివి రాజగోపాల్, మేడిది సత్యనారాయణ రావు, ప్రొఫెసర్ దేవన్న, రాజా వాసుదేవరెడ్డి మల్లీశ్వరి, యశోద పెను బాల, కళ తాటికొండ, మంజుల సూర్య తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ పన్ను చెల్లింపుదారులకు అవగాహన సదస్సు

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



ఆదాయపన్ను చెల్లింపుదారులకి చట్టపరంగా చేయవల సిన పనుల్లో బాధ్యత లోటుపాట్ల కారణంగా వస్తున్న అనేక రకాల నోటీసులపై ప్రజల్లో భయాందోళనలను తొలగించడానికి తమ వంతు సహకారం అందించడానికి సదస్సు ఏర్పాటు చేస్తున్నామని వరంగల్ చైర్మన్ సీఏ రాయబారపు హరిక్రిష్ణ తెలిపారు. వరంగల్ బ్రాంచ్ ఆఫ్ ఎస్ఐఆర్సీ ఆఫ్ ఐసీఏఐ ఆధ్వర్యంలో సీఏ రాయబారపు హరిక్రిష్ణ అధ్యక్షతన ప్రజల సందేహాలను నివృత్తి చేయుటకు ఆదాయం పన్ను, టీడీఎస్‌ల పైన అవగాహన కార్యక్రమాన్ని ఈనెల 24న ఐసీఏఐ భవన్, హంటర్ రోడ్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని హరిక్రిష్ణ, పాలక వర్గ సభ్యులు విడుదల చేశారు. ఈ సదస్సుకు వాణిజ్య వ్యాపార వర్గాలు, పన్ను చెల్లింపుదారులు అధికసంఖ్యలో హాజరై సందేహాలు నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ సీఏ భగవన్ దాస్ ముందడ, కార్యదర్శి సీఏ సత్యనారాయణ పూజారి, కోశాధికారి సీఏ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వాగ్‌జాయికి మొక్కులు

నవతెలంగాణ-పర్వతగిరి



మండలంలోని ఇస్లావత్ తండా గ్రామంలో బుధవారం ఉగాది పండుగ సందర్భంగా స్థానికులు వాగ్ జాయి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ నేపథ్యంలో తండా వాసులు తమ పంటలు సమృద్ధిగా పండాలని, పిల్లలు,పెద్దలకు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని కోరుతూ గిరిజనులు భక్తి శ్రద్ధలతో వాగ్‌జాయిమాతకి మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన యూత్ సభ్యులు, మహిళలు, తండా వాసులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాన్ని అందుకున్న లంక శివకుమార్

నవతెలంగాణ-మట్టెవాడ



రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పర్వదినాన అందించే ఉగాది పురస్కారానికి వరంగల్ స్టేషన్ రోడ్డులోని ఆకారపువారి గుడి శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు లంక శివకుమార్ శర్మ అందుకున్నారు. వివిధ విభాగాల్లో సాంస్కృతిక, సామాజిక పౌరోహిత్యంలో అంది స్తున్న ఉత్తమసేవలకు గుర్తింపుగాబుధవారం హైదరా బాదులోని రవీంద్ర భారతిలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి ఎమ్మెల్సీ బండ ప్రకాష్ చేతుల మీదుగా లంక శివకుమార్ శర్మ ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు.

లంక శివకుమార్‌కి మంత్రులు మల్లారెడ్డి, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, సమక్షంలో శాలువాతో సత్కరించి ఉగాది పురస్కారాన్ని అందజేశారు.

విద్యార్థులు ఇష్టపడి చదవి ఉన్నత లక్ష్యాన్ని సాధించాలి

కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్



నవతెలంగాణ - హన్మకొండ

విద్యార్థులు ఇష్టంతో చదివితే ఉన్నత స్థానం చేరుకుంటారని కూడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ అన్నారు. బాలసముద్రంలోని శ్రీనివాస్ గురుకుల పాఠశాల వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్‌యాదవ్, వరంగల్ డీసీపీ మహమ్మద్ అబ్దుల్ బారి, వడుప్సా హనుమ కొండ అధ్యక్షుడు మాడాల సతీష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుందరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసే ప్రయత్నమే ఈ కార్యక్రమం అన్నారు. ప్రతి విద్యార్థి మొదటి గురువు తల్లిఅని అన్నారు. మహమ్మద్ అబ్దుల్ బారి ప్రసంగిస్తూవిద్యార్థులు మొబైల్ ఫోన్, టీవీలకు దూరంగా ఉంటూ పుస్తకాల్లో ఉన్న జ్ఞానాన్ని గ్రహించి సమయ పాలన పాటించినట్లయితే నిర్దేశించుకున్న గమ్యాన్ని చేరుకంటారని తెలియజేశారు.

వడుప్సా ప్రెసిడెంట్ మాదాల సతీష్ కుమార్ మాట్లాడుతూ పిల్లలకు చిన్నప్పటి నుండే నీతి కథలు బోధించడం ద్వారా వారిలో ఉన్న సుగుణాలు మరింత మెరుగుపడతాయని.. తద్వారా ఎన్నో విజయాలను అలవోకగా సాధించగలరని తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన గౌరవ అతిథులను పాఠశాల యాజమాన్యం జ్ఞాపికలతో సత్కరించారు. అనంతరం జాతీయ గణిత ఒలంపియాడ్ పోటీ పరీక్షల్లో, రాష్ట్రస్థాయి ర్యాంకులు, క్రీడా విభాగంలో ప్రతిభను కనబరిచిన పాఠశాల విద్యార్థులను ఘనంగా సత్కరించారు. అతిథులుగా విచ్చేసిన శ్రీనివాస్ ఇంద్ర మాట్లాడుతూ శ్రీనివాస్ గురుకుల్ స్కూల్లో ఐఐటి ఫౌండేషన్‌లో విద్యనభ్యసించిన ఎంతోమంది విద్యార్థులు ఉన్నత స్థానంలో ఉన్నారని తెలుపుటకు ఎంతో గర్విస్తున్నామని తెలియజేశారు.

శ్రీనివాస్ గురుకుల్ స్కూల్ కరస్పాండెంట్ చిదురాల సోమరత్నం మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన ముఖ్య అతిథులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులకు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులచే ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అతిథులను ఎంతగానో అలరించాయి.

ఆకతాయికి విద్యార్థిని తల్లిదండ్రుల దేహశుద్ధి

'నవతెలంగాణ' ఎఫెక్ట్

నవతెలంగాణ-హసన్‌పర్తి

ఇంటర్ పరీక్షా కేంద్రం వద్ద యువకుడి న్యూసెన్స్ అనే కథనంపై నవతెలంగాణ దినపత్రికలో ఈ నెల 21వ తేదీన ప్రచురితమైన వార్తకు అమ్మాయిల్లో చైతన్యం వచ్చిందనడానికి ఇదోక నిదర్శనమని చెప్పోచ్చు. మండలంలోని ఎర్రగట్టుగుట్ట క్రాసురోడ్డులోని ఓ ఇంటర్ పరీక్షా కేంద్రం వద్ద ఈ నెల 21వ తేదీన ఇంటర్ రెండవ సంవత్సరం పరీక్ష జరుగుతోంది. ఈ క్రమంలో గత మూడు రోజులుగా పరీక్షా కేంద్రంలో ఓ ఇంటర్ విద్యార్థి సెంటర్‌లో తన పక్కనే పరీక్ష రాస్తున్న అమ్మాయిని సెల్ నెంబర్ ఇవ్వమంటూ వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ క్రమంలో 'నవతెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన ఇంటర్ పరీక్షా కేంద్రం వద్ద యువకుడి న్యూసెన్స్... అమ్మాయితో అసభ్య ప్రవర్తన అనే కథనంతో కేయూ ఇన్‌స్పెక్టర్ దయాకర్ పరీక్షా కేంద్రం వద్ద న్యూసెన్స్ చేస్తున్న యువకుడిని అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చిన తీరుతో ఆ అమ్మాయిలో పోలీసుల పట్ల మరింత నమ్మకం పెరిగి ధైర్యం చేసింది. విషయం తల్లిదండ్రులకు చెప్పి పరీక్ష అనంతరం ఆ ఇంటర్ విద్యార్థిని రామారం కాంటా సమీపం వద్దకు వస్తే సెల్ నెంబర్ ఇస్తానని నమ్మబలికింది. దీంతో ఆ యువకుడు అక్కడకు చేరుకున్నాడు. ఇంకేముంది కథ రక్తికట్టింది. అమ్మాయి తల్లిదండ్రులు, బంధువులు ఆ ఇంటర్ విద్యార్థికి దేహశుద్ధి చేసి కేయూ పోలీసులకు అప్పగించడంతో కథ సుఖాంతమైంది. ఇలాంటి ఘటనలతో అమ్మాయిల్లో చైతన్యం తీసుకురావడానికి తోడ్పాటునందించిన నవతెలంగాణ రిపోర్టర్‌తో పాటు కేయూ పోలీసులకు, ధైర్యంతో తల్లిదండ్రులకు జరిగిన విషయాన్ని చెప్పడానికి సహసం చేసిన అమ్మాయిని స్థానిక ప్రజలు అభినందించారు.

కన్నుల పండుగగా శుభకృత్ నామ సంవత్సర వేడుకలు








నవతెలంగాణ-శాయంపేట

మండల పరిధిలోని గ్రామాలలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం ఆలయాల్లో ఆలయ అర్చకులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. శాయంపేటలోని శివమార్కండేయ వెంకటేశ్వరస్వామి ఆలయాలలో, శ్రీ మత్స్యగిరి స్వామి ఆలయంలో, పెద్దకోడెపాకలోని రాజరాజేశ్వరాలయంలో ఉదయమే మహాగణపతి పూజ, మహన్యాస రుద్రాభిషేకం, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఉగాది పచ్చడిని తయారుచేసి నైవేద్యంగా సమర్పించి, భక్తులకు తీర్థప్రసాదాలుగా పంచిపెట్టారు. అనంతరం ఆయా ఆలయాల అర్చకులు మార్త రాజ్ కుమార్, ఆరుట్ల కృష్ణమాచార్యులు, అనుదీప్ శర్మలు శ్రీ శోభకత్ నామ సంవత్సర పంచాంగ శ్రవణం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ లు బాసాని సూర్య ప్రకాష్, సామల బిక్షపతి, గ్రామ పెద్దలు జిన్నా ప్రతాప్ సేనారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండలం లోని వడ్లకొండలో శుభ కతు నామ సంవత్సరం ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం గుట్ట పైన జరిగే శ్రీ రంగనాయకుల స్వామి వారి జాతరలో భాగంగా స్వామివారికి స్థానిక సర్పంచ్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు అమడగాని రాజు యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఉప్పలయ్య, మరియు రంగనాయకుల స్వామి భక్తులు, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలం లోని ఆయా గ్రామాల దేవాలయాల్లో ఉగాది వేడుకలలో బాగంగా పంచాంగ శ్రవణంలో వారి వారి రాశి ఫలాలు తెలుసుకున్నారు.

కాజీపేట : శుభకృత్ నామసంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని 47వ డివిజన్ కార్పొరేటర్ సంకు నర్సింగ్ రావు నివాసంలో కుల మతాలకు అతీతంగా డివిజన్‌లోని ముస్లిం మైనారిటీలతో కలిసి ఉగాది పండుగ జరుపుకున్నారు. అనంతరం ముస్లింలకు ఉగాది పచ్చడి అందించారు. ఈ సందర్భంగా నర్సింగ్‌రావు మాట్లాడుతూ కుల మతాలకతీతంగా ఉగాది వేడుకలు జరుపుకోవడం జరిగిందన్నారు. ప్రతిఒక్కరి జీవితంలో తెలుగు నూతన సంవత్సరం సుఖసంతోషాలు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకోవడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు మహమ్మద్ సోనీ, టైగర్ యూత్ సభ్యులు ముస్తాక్ బాయ్, ఇబ్రహీం, సత్తార్, గౌస్, బాబాయ్, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండల కేంద్రంలోని స్థానిక ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు స్వగృహంలో ఉగాది పండుగ ఉత్సవాలు మండల బీఆర్ఎస్ నాయకుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ తెలుగు నూతన సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా ఎంపీపీ నివాసంలో ఏర్పాటు చేసిన షడ్రుచుల సమ్మేళనం కలగలిసిన ఉగాది పచ్చడిని పండుగలో పాల్గొన్న అందరికీ పంచారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని ఖానాపురం మండల ప్రజలు సుభిక్షంగా, యరోగ్యాలతో, అష్టఐశ్వర్యాలతో కలకాలం ఉండాలని, సీఎం కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రం సుభిక్షంగా వెలుగొందాలని, నర్సంపేట శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో నర్సంపేట అభివద్ధిలో ముందుకు సాగాలని కోరారు.సొసైటీ వైస్ చైర్మన్ దేవినేని వేణుకష్ణ,ఉప సర్పంచ్ మేడిద కుమార్, సొసైటీ డైరెక్టర్ నీలం సాంబయ్య, రైతుబంధు జిల్లా కమిటీ సభ్యులు బొప్పిడి పూర్ణచందర్ రావు,మాజీ సర్పంచ్ తక్కలపెల్లి రమేష్,సోషల్ మీడియా మండల కన్వీనర్ దాసరి రమేష్,గ్రామపార్టీ అధ్యక్షుడు మచ్చిక అశోక్ గౌడ్,గ్రామ కో-ఆప్షన్ సభ్యులు మాల్యాల పోశెట్టి,రెడ్డి నాగార్జున రెడ్డి,నాయకులు మర్రి రామస్వామి, పంతిని వెంకన్నగంగాపురం అనిల్,మానపెల్లి వెంకన్న,యార్లగడ్డ గాంధీ తదితరులు వేడుకలో పాల్గొన్నారు.

నల్లబెల్లి : మండల కేంద్రంలోని హనుమ దేవస్థానం ప్రాంగణంలో గల వాగ్దేవి యువజన కళా సంస్థ వేదికపై బుధవారం తెలుగు సంవత్సరాది శ్రీ శుభకత్ నామ సంవత్సర (ఉగాది) పర్వదినాన్ని పురస్కరించుకొని పంచాంగ శ్రవణం అంగరంగ వైభవంగా నిర్వహించారు.


శ్రీ శోభకత నామ సంవత్సరానికి సంబంధించిన ఉగాది మొదలుకొని సంవత్సరాంతం వరకు వివిధ రాశుల వారి ఆదాయం, ఖర్చులు, రాజపూజ్యం, అవమానానికి సంబంధించిన విషయాలను పురోహితులు కొండ కష్ణస్వామి, తిరునాహరి సత్యనారాయణ స్వామి క్షుణ్ణంగా పంచాంగ శ్రవణం తెలియజేశారు. అనంతరం గ్రామము, మండలము, జిల్లా, రాష్ట్రము, దేశం యొక్క జాతక విషయాలను గురించి వివరించారు. అనంతరం రాశుల వారి విధంగా కొత్త సాలు విషయాలను తెలిపారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నానాబోయిన రాజారాం, ఉపసర్పంచ్ లత నాగేశ్వరరావు, గ్రామ అభివద్ధి కమిటీ అధ్యక్షుడు నాగెల్లి శ్రీనివాస్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు ఉడుత రాజేందర్, బత్తిని మల్లయ్య, మంద రాజన్న గుండాల శ్రీశైలం, భోగ భద్రయ్య,సామల లక్ష్మీనారాయణ, గ్రామ కుల పెద్దలు, అధిక సంఖ్యలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
4
జనగామ, మహబూబాబాద్
గురువారం 23.03.2023







వాచర్లకు నూతన వస్త్రాలు పంపిణీ చేసిన జెడ్పీటీసీ



నవతెలంగాణ-జఫర్‌గడ్

మండలంలోని తిమ్మంపేట గ్రామంలో 8 మంది వాచర్లకు, వారు చేస్తున్న సేవలను గుర్తించి జెడ్పీటీసీ ఇల్లందుల బేబీ శ్రీనివాస్ బుధవారం నూతన వస్త్రాలు పంపిణీ చేసి సేవ దాతృత్వాన్ని చాటుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గ్రామంలో ఇంకా మొక్కలు ఎక్కువగా నాటాలని, వాటిని నిరంతరం పర్యవేక్షిస్తూ వాటికి నీటిని అందిస్తూ, కాపాడాలని, మొక్కలు రేపటి తరాలకు ఎన్నో విధాలుగా ఉపయోగపడుతాయని అన్నారు. మంచి ఆక్సిజన్, మంచి వాతావరణం కావాలంటే ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని ఈ సందర్భంగా కోరారు.

పంచాంగ శ్రవణం



నవతెలంగాణ-లింగాలఘణపురం

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో శ్రవణం పురోహితుడు ఉమనాథ శర్మ నూతన సంవత్సర పంచాంగ శ్రవణం నిర్వహించారు. మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాలలో ఉగాది పండుగ సందర్భంగా ప్రజలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని జీడుకల్ శ్రీవీరాచల శ్రీరామచంద్రస్వామి దేవాలయంలో, నవా బుపేటలోని శ్రీ కోదండ రామస్వామి దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విజయ మనోహర్, ఎంపీటీసీ బిక్షపతి, మాజీ సర్పంచులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



మార్చి 27 బహిరంగ సభను జయప్రదం చేయండి


సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొట్ల శేఖర్

నవతెలంగాణ-లింగాలఘనపురం

మార్చి27న జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొట్ల శేఖర్ కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. బుధవారం మండలంలోని కళ్లెం గ్రామంలో సీపీఎం పార్టీ కళ్లెం గ్రామ జనరల్ బాడీ సమావేశం మబ్బు ఉప్పలయ్య అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. బొట్లశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ బీజేపీ మతోన్మాద కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా సంక్షేమం మత సామరస్యం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం సీపీఎం అఖిలభారత కమిటీ పిలుపులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో మార్చి 17 నుండి 29 వరకు జన చైతన్య యాత్రలు జరుగుతున్నాయి. ప్రజలు, ప్రజాస్వామికవాదులు, లౌకికవాదులు, మేధావులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు, ఈ కార్యక్రమంలో సీపీఎం లింగాలగణపురం మండల కార్యదర్శి బొడ్డు కరుణాకర్, మబ్బు ఉప్పలయ్య, సిరిగిరి కిష్టయ్య, జహంగీర్, టి.రాఘవేంద్ర, ఎండి.హత్య, లావణ్య, కవిత, శోభ, మేరీ, సుజాత, మహేష్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్ధంతి సభలను జయప్రదం చేయండి

పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్



నవతెలంగాణ-బయ్యారం

నూనూగు మీసాల వయస్సులో దేశం కోసం ప్రాణాలర్పించిన విప్లవ వీర కిషోరాల అమరత్వాన్ని ఎత్తిపడుదామని పీడీఎస్‌యూ మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ అన్నారు. మార్చి 23న భగత్ సింగ్, రాజ్ గురు, సుకుదేవ్‌ల వర్ధంతిని స్మరిస్తూ పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ ఈ నెల 23 నుండి 30 తేదీ వరకు నిర్వహించ తలపెట్టిన అమరుల వర్ధంతి సభల పోస్టర్ పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బానోత్ దేవేందర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేడు పూర్తిగా విద్యావ్యవస్థని విస్మరించాయని, బీజేపీ ప్రభుత్వం నేడు యూనివర్శిటీలల్లో, విద్యా సంస్థల్లో మత విద్వేశాలు రెచ్చగొడుతుందన్నారు. అందులో భాగంగానే 2020 నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చి విద్యార్థుల మెదలల్లో కాషాయకరణ నూరిపోస్తుందని ఆరోపించారు. అమరుల త్యాగాలను ఎత్తిపడుతూ మతోన్మాదం, ఫాసిజంకి వ్యతిరేకంగా, విద్యా ఉపాధి అవకాశాల సాధనకై ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు భానోత్ అరవింద్, జైపాల్, కళ్యాణ్, కృష్ణ, ప్రమోదర్, అఖిల్, మహేష్, సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కవులు,రచయితలు సమాజానికి మార్గదర్శులు


26వ వార్డ్ కౌన్సిలర్ స్వాతి శంకర్



నవతెలంగాణ-మహబూబాబాద్

కవులు, రచయితలు సమాజానికి మార్గదర్శులు అని 26వ వార్డ్ కౌన్సిలర్ స్వాతి శంకర్ అని తెలిపారు. బుధవారం మానుకోటలో శుభోదయం సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ అమ్మ దీవెన చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కవి సమ్మేళనంలో శుభోదయం అధ్యక్షుడు సంకెపల్లి శ్రీనివాస రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్వాతిశంకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉగాది పండుగ రోజు కవులు రచయితలు సమాజానికి కావలసిన అన్ని విషయాలను క్రోడీకరించి కవిత్వంద్వారా తెలియచేయటం గొప్ప విషయం అని తెలిపారు. అధ్యక్షుడు సంకెపల్లి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ సమాజాన్నీ సక్రమార్గంలో నడపటానికి కృషి చేయాలని కోరారు.అమ్మ దీవెన చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సంకెపల్లి కీర్తన రెడ్డి మాట్లాడుతూ నూతన ఉగాది మంచి ఆశలకు పునాది కావాలని కోరారు. ఈసమావేశంలో టి.కవిత, సునీత, రమాదేవి, అమర్నాథ్, పి.శ్రీనివాస రావు, బొడల వెంకటయ్య జీజ్ ఖాన్, బి.వినోద్‌రెడ్డి, నాగేంద్ర నాగేశ్వరరావు, బొడ్డుపల్లి వీరాస్వామి, రామ్మూర్తి,గణేష్, అమర్నాథ్ యల్.దయానంద్,శ్రీపాద సంతోష్, బండి నరేందర్ రెడ్డి,లక్ష్మి కాంతరావు పాల్గొన్నారు. కవులకు జ్ఞాపిక అందచేసి శాలువాతో సన్మానం చేశారు.

ఘనంగా ఉగాది పర్వదిన వేడుకలు



నవతెలంగాణ-పాలకుర్తి

శోభాకృత్ నామ తెలుగు సంవత్సరాన్ని పురస్కరించుకొని బుధవారం ఉగాది పర్వదిన వేడుకలను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఏడు రుచులతో కూడిన పచ్చడిని తయారు చేసుకుని ఉగాది పండుగను జరుపుకున్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా ప్రతి ఇంట బచ్చాలు చేసుకున్నారు. ఉగాది పండుగను పురస్కరించుకొని గ్రామీణ అ ప్రాంతాల్లో పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని ఆయా గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో నిర్వహించి ప్రజలు జాతక వివరాలను తెలుసుకున్నారు.ఉగాది సందర్భంగా మండలంలోని బమ్మెరలో కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. అర్చకులను ఘనంగా సన్మానించారు.

శతాధిక వృద్ధురాలు మృతి



నవతెలంగాణ-పెద్దవంగర

మండలంలోని రంగీ తండా వ్యవస్థాపకురాలు జాటోత్ రంగమ్మ (102) శతాధిక వృద్ధురాలు బుధవారం మృతి చెందారు. గత కొంత కాలంగా వృద్ధాప్యంతో బాధపడుతూ ఉగాది పర్వదినాన ఆమె స్వగృహంలో మృతి చెందారు. రంగమ్మకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. తండావాసులు ఆ వృద్ధ మహిళను చూడడానికి భారీగా తరలివచ్చారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



నవతెలంగాణ-నెల్లికుదురు

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కాచికల్ గ్రామ శివారులోని తిమ్మతండాలో బుధవారం చోటుచేసుకుంది. నెల్లికుదురు ఎస్సై రాణా ప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం నెల్లికుదురు మండలంలోని తిమ్మతండా కు చెందిన గుగులోతు దేవేందర్ (35) అనే వ్యక్తి విద్యుత్ షాక్‌తో మృతి చెందాడని తెలిపారు. ఆయన భార్య గుగులోతు సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శ్రీ రామనవమి నాటికి అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

పర్యాటక పనుల్లో వేగం పెంచాలి - రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్ రావు





నవతెలంగాణ-పాలకుర్తి

శ్రీరామ నవమి నాటికి అభివృద్ధి పనులన్నీ పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశించారు. మండలంలోని వల్మీడీలో శ్రీరామనవమి సందర్భంగా ఈనెల 30న జరిగే సీతారామచంద్ర స్వామి కళ్యాణ ఏర్పాట్లతో పాటు అభివృద్ధి పనులను మంత్రి ఎర్రబెల్లి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టూరిజం ప్యాకేజీలో వల్మిడీని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు 7కోట్ల రూపాయల నిధులనుమంజూరు చేశామని తెలిపారు. సీతారామచంద్ర స్వామి కళ్యాణ ఏర్పాట్లతోపాటు టూరిజం పనుల్లో వేగం పెంచాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శ్రీరామ నవమికి భక్తులు వేలాదిగా తరలి వచ్చేందుకు కృషి చేయాలన్నారు. మండలంలోని చెన్నూరు, ముత్తారం, మంచుప్పుల, మల్లంపల్లి గ్రామాల నుండి భక్తులు వేలాదిగా తరలి రావాలని, మిగతా గ్రామాల నుండి శ్రీరామ నవమికి భక్తులు హాజరు కావాలని సూచించారు. శ్రీరామ నవమి కళ్యాణానికి కళ్యాణంలో కూర్చునే వారికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. శ్రీరామనవమి సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. శ్రీరామనవమి సందర్భంగా వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, జెడ్పీ ఫ్లోర్ లీడర్ పుస్కూరి శ్రీనివాసరావు, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ వీరమనేని యాకాంతారావు, ఐలమ్మ మార్కెట్ కమిటీ చైర్మన్ ముస్కు రాంబాబు, పాలకుర్తి ఆలయ చైర్మన్ వెనుకదాసుల రామచంద్రయ్య శర్మ, వల్మిడి దేవస్థానం చైర్మన్ వీరమల్ల జైహింద్, సర్పంచ్‌లు కత్తి సైదులు, బొమ్మగాని కొమురయ్య, ఎంపీటీసీ సోమనారాయణ, వల్మిడి సీతారామచంద్రస్వామి ఆలయ సలహాదారు వీరమల్ల బాబురావు, బీఆర్ఎస్ మండల ప్రచార కార్యదర్శి వీరమల్ల రాజు, మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, వల్మిడి ఉపసర్పంచ్ నీరటి సోమయ్య, ఉప సర్పంచ్ల ఫోరం జిల్లా అధ్యక్షుడు మారుజోడు సంతోష్, నాయకులు చింతకింది ఉపేందర్, వీరమల్ల దేవేందర్, చెరుకు ప్రభాకర్, సైదులు పాల్గొన్నారు.

అర్చకున్ని సన్మానించిన మంత్రి ఎర్రబెల్లి



నవతెలంగాణ-పాలకుర్తి

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అర్చకునిగా పనిచేస్తున్న రాష్ట్ర అర్చక, ఉద్యోగ జేఏసీ కన్వీనర్ డివిఆర్ శర్మను బుధవారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సన్మానించారు. శోభకృత్ ఉగాది తెలుగు సంవత్సరాన్ని పురస్కరించుకొని సోమేశ్వర లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.

తీన్మార్ మల్లన్న అక్రమ అరెస్టుకు నిరసనగా రాస్తారోకో

బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్



నవతెలంగాణ-బయ్యారం

మండల కేంద్రంలో అన్నీ రాజకీయ పార్టీ నాయకులు, కుల సంఘల నాయకులు, విద్యార్థి సంఘ నాయకుల ఆధ్వర్యంలో తీన్మార్ మల్లన్న అక్రమ అరెస్టుకు, క్యూ న్యూస్ కార్యాలయాన్ని ధ్వంసం చేసిన దాని పై నిరసనగా బుధవారం మహబూబాబాద్ నుంచి భద్రాచలం వెళ్లే ప్రధాన రహదారి పై గంటకు పైగా రాస్తారోకో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య నాయకులు మాట్లాడుతూ క్యూ న్యూస్ వ్యవస్థాపకులు, ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్న కొన్ని నెలలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అరాచక పరిపాలనను ప్రశ్నిస్తూ, భూ కబ్జాలను వెలికితీస్తూ రోజు రోజుకు తెలంగాణ ప్రజలను చైతన్య పరుస్తున్నాడని, అంతేకాక కవిత లిక్కర్ స్కాంపై, గ్రూప్-1 పేపర్ లీకేజ్ పై వరస కథనాలు రాస్తూ అటు తెలంగాణ సమాజాన్ని ఇటు విద్యార్థి నిరుద్యోగులను చైతన్యం చేయడాన్ని చూసి ఓర్వలేక సోమవారం హైదరాబాద్ కేటీఆర్ అనుచరులు, బీఆర్ఎస్ రౌడీ షీటర్లు, గుండాలు, పోలీసులు చొరబడి క్యూ న్యూస్ కార్యాలయాన్ని ధ్వంసం చేసి సిబ్బందిని, మల్లన్నని అరెస్ట్ చేయడం హేయమైన చర్యని అన్నారు. తక్షణమే దాడి చేసిన వారిని అరెస్టు చేసి, కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పత్రిక కార్యాలయాల పై దాడులకు ప్రేరేపించడం సిగ్గుచేటని బీఆర్ఎస్ పార్టీ నాయకులకు దమ్ము ధైర్యం ఉంటే ప్రత్యక్షంగా చర్చకు రావాలని, ఇలా ముసుగులు తొడుక్కొని కిరాయి గుండాలతో దాడులు చేయించడం పిరికిపంద చర్యఅని,తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి అక్రమాల పై క్యూ న్యూస్ ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తూనే ఉంటుందని క్యూ న్యూస్ తిన్మార్ మల్లన్న టీమ్ ఎవ్వరికి బయపడదని హెచ్చరించారు. తీన్మార్ మల్లన్నకు ఎప్పుడు ప్రతిపక్ష పార్టీల మద్దతు ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విహెచ్‌పి జిల్లా అధ్యక్షులు యలమంచిలి వెంకటేశ్వర్ రావు, బీజేపీ పార్టీ అధ్యక్షులు వీసం వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ నాయిని శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు జూలకంటి సీతారామరెడ్డి, బానోత్ సుధాకర్ నాయక్, మందనపు వెంకన్న, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ రాష్ట్ర నాయకులు తుడుం వీరభద్రం, పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు నేతకాని రాకేష్, ప్రజాపంథా సంయుక్త కార్యదర్శి బిల్లకంటి సూర్యం, సీఐటీయూ మండల కార్యదర్శి వల్లాల వెంకన్న, ఎఐఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మాగం లోకేష్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు తోకలు ఎంకన్న, రామచంద్రుల మురళి, డబ్బా వెంకటనర్సు, కొత్త రాందాస్, పొంగిలేటి కోరం వర్గీయులు సంకు సత్తిరెడ్డి, రాసమల్ల నాగేశ్వరరావు, నందగిరి భద్రయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు గంట శ్రీనివాస్ మాదిగ, సేవాలాల్ సేన జిల్లా కార్యదర్శి రవీందర్ నాయక్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్త వీనయ్ బాబు, బీసీ జనసభ జిల్లా అధ్యక్షులు చల్లా గోవర్ధన్, మండల అధ్యక్షులు పోతురాజు రాజశేఖర్ మాదిగ, కేవీపీఎస్ మండల అధ్యక్షులు చంటి, ఎల్‌హెచ్‌పిఎస్ మండల అధ్యక్షులు నరేష్, ఆదివాసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు ప్రకాష్, లైవ్ ఐక్య వేదిక మండల కార్యదర్శి బోడ బావుసింగ్, బీసీ సంక్షేమ సంఘ యూత్ అధ్యక్షులు కాకి విజయ్, పుల్లూరి ఉపేందర్, ఇంద్రారెడ్డి, నాయకులు జినక లక్ష్మణ్, మరికంటి నరేష్, నందిపాటి సురేష్, గుర్రం రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సహజ పానీయాలే మేలు : ఎస్పీ శరత్ చంద్ర పవార్



నవతెలంగాణ-మహబూబాబాద్

ప్రకృతి ప్రసాదించిన సహజపానీయాలే మేలు అని ఎస్పీ శరత్చంద్ర పవర్ అన్నారు. బుధవారం జన విజ్ఞాన వేదిక జిల్లా మండల కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు తడకమళ్ళ బ్రహ్మం అధ్యక్షతన నెహ్రూ సెంటర్లో నిర్వహించిన ఉగాది పచ్చడి సహజ పానీయాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడారు. ప్రకృతిలో లభించే సహజ పండ్లు, పండ్ల రసాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, అలాంటి వాటిని తీసుకోవడం వల్ల జీవన ప్రమాణాలను పెంచుకోవచ్చని ఎలాంటి జబ్బుల బారిన పడకుండా ఉండవచ్చన్నారు. కృత్రిమ రసాయన శీతల పానీయాలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యానికి నష్టం జరుగుతుందన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శీతలపానీయాలు వద్దు... సహజ పానీయాలే ముద్దు... అనే కరపత్రాన్ని ఆవిష్కరించారు. విశిష్ట అతిథులుగా హాజరైన ప్రముఖ డాక్టర్ నెహ్రూ రాథోడ్, ప్రముఖదంత వైద్య నిపుణులు డాక్టర్ బి.అనిల్ గుప్తా, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.వెంకట్రాములు, ప్రముఖ నేత్రవైద్య నిపుణులు డాక్టర్ కాలేరు సత్యనారాయణ,డాక్టర్ చింత రమేష్‌లు మాట్లాడుతూ శీతల పానీయాలు ఆరోగ్యానికి ఎంతో కీడు చేస్తాయని, సహజ సిద్ధంగా ప్రకృతిలో లభించే సీజనల్ పండ్ల రసాలు, కొబ్బరి బొండం, నిమ్మ రసం, మజ్జిగ, చెరకు రసం, ఇమ్యూనిటీ పెంచడమే కాకుండా ఆరోగ్యాన్నిస్తాయన్నారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తడక మల్ల బ్రహ్మం, లింగంపల్లి దయానంద్, మండల అధ్యక్ష కార్యదర్శులు, బండి నరేందర్ రెడ్డి, తేలుకుంట్ల సునీత మాట్లాడుతూ ప్రజల కోసం సైన్స్, ప్రగతి కోసం సైన్స్,శాంతి కోసం సైన్స్, దేశం కోసం సైన్స్, ఆరోగ్యం కోసం సైన్స్ అను నినాదంతో పని చేస్తున్న జన విజ్ఞాన వేదిక ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ చైతన్య కార్యక్రమాన్ని గత 13 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామన్నారు. సహజ పానీయాలు పంపిణీ దాదాపు రెండు వేల మందికి పైగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి జమాతే ఇస్లామి సోదరులు సంఘీభావాన్ని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి సాహితీ శ్రీనివాస్,జిల్లా ఉపాధ్యక్షులు మైస నాగయ్య, ప్రతాపని మంగపతిరావు, జిల్లా కోశాధికారి సాహితీ శ్రీనివాస్, ఎర్రం రెడ్డి ఉమాదేవి, టీవీ.రాంనర్సయ్య, వై.కృష్ణప్రసాద్, చొప్పరి శ్రీనివాస్, జంపాల యాకయ్య ఆగూర్తి సురేష్, బాలాజీ, సంకేపల్లి శ్రీనివాస్ రెడ్డి, చిన్న గూడూరు మండల అధ్యక్షులు రహమాన్, చంద్రశేఖర్, వివి నాగేందర్, బయ్యారం మండల అధ్యక్షులు యు.శ్రీనివాస్, చెన్నబోయిన దర్గయ్య, జక్కి నాగేశ్వర్, మోహన్ రావు, బాలు చౌహాన్, సత్తార్, రహీం, వెంకట్ వరలక్ష్మి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

జనగామ కాంగ్రెస్‌లో రచ్చ...రచ్చ...

ఎన్నికలు సమీపిస్తున్నా... సర్దుకోని నేతలు





నవతెలంగాణ - జనగామ కలెక్టరేట్

జనగామ కాంగ్రెస్ పార్టీలో రోజు రోజుకు రగులుతోన్న రాజకీయ వేడి ఇసుమంత కూడా తగ్గడం లేదు.ఎన్నికలు సమీపిస్తున్న ప్రస్తుత తరుణంలో అన్నింటికి సర్దుకుపోవాల్సిన నేతలు రచ్చకెక్కి రచ్చ రచ్చ చేస్తున్నారని కార్యకర్త చర్చించుకుంటున్నారు. రెండు, మూడు రోజులుగా ఇక్కడి కాంగ్రెస్ పార్టీలో అనూహ్య సంఘటనలు చోటు చేసుకుంటూ కార్యకర్తలకు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. జిల్లాపార్టీ అధ్యక్షులుగా కొనసాగుతున్న జంగా రాఘవరెడ్డి వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుండి వచ్చే శాసన సభ ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటించి అయన వర్గాన్ని అయోమయానికి గురి చేశారు. కాంగ్రెస్ పార్టీలో జాతీయ స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు ప్రజా స్వామ్యం కాస్త ఎక్కువగానే ఉంటుందనేది అందరికి తెలిసిందే. కాని జనగామ కాంగ్రెస్‌లో ఆ ప్రజాస్వామ్యం కాస్త శృతి మించి రాగాన పడ్డట్టుంది. జిల్లా కేంద్రమైన జనగామ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ముగ్గురు నాయకుల నేతృత్వంలో మూడుముక్కలై వర్ధిల్లుతున్న తరుణంలో ఒకరి పై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటూ ఎదుటి పార్టీలకు ఏ మాత్రం పని లేకుండా చేస్తున్నారని చెప్పుకుంటున్నారు. టిపిసిసి మాజీ అధ్యక్షులు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, పార్టీ జిల్లా శాఖ అధ్యక్షులు జంగా రాఘవరెడ్డి, మాజీ శాసన సభ్యులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిలు ఎవరికి వారుగా పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తుండడంతో కార్యక ర్తల్లో ఆయోమయం ఏర్పడుతోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధిష్టానం టికెట్ ఎవరికి ఇస్తుందో తెలియదు కాని నాయకుల్లో ఏ మాత్రం సమన్వయం వ్యక్తం కావడం లేదని వారు వాపోతున్నారు. హాత్ సే హాత్ జోడో కార్యక్రమాలను కూడా ముగ్గురు నాయకులు వేరు వేరుగా నిర్వహిస్తున్న విషయం అందరికి తెలిసిందే. పొన్నాల లక్ష్మయ్య వర్గం పట్టణంలో పాదయాత్రను కొనసాగిస్తుండగా కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 24 నుండి చేపట్టనున్నట్లు రెండు రోజుల క్రితం ప్రకటించారు. డిసిసి అధ్యక్షులు జంగా రాఘవరెడ్డి 4,5,రోజులుగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో పాదయాత్రలను కొనసాగిస్తుండడం గమనార్హం.

ఎటూ పాలుపోని కార్యకర్తలు...

జనగామ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి బలమైన క్యాడర్ ఉందనేది వాస్తవం. చేర్యాల (పాత నియోజకవర్గం) ప్రాంతం కూడా కలిసి రావడంతో ఆ బలం ఇంకాస్త పెరిగే అవకాశాలున్నాయని చెబుతున్నారు. పార్టీలోని ముగ్గురు నేతలు మూడు వర్గాలుగా విడిపోవడంతో కార్యకర్తల్లో కూడా ఆ చీలిక ఏర్పడింది. ప్రస్తుతం డిసిసి అధ్యక్షులు జంగా రాఘవరెడ్డి వరంగల్ పశ్చిమ నియోజక వర్గంలో పోటీ చేస్తానని ఆయనేస్వయంగా ప్రకటించడంతో ఆవర్గం కార్యకర్తల్లో అయోమయం ఏర్పడింది. ఒక్క సారిగా ఆయన వర్గంపై బాంబు పడ్డట్టుగా భావిస్తున్నారు. ఇంత కాలం ఆయన వర్గంలో పని చేసినందున తమ భవిష్యత్తు ప్రశ్నార్ధకంగా ఎక్కడ మారుతుందోననే ఆందోళనలో వారున్నారు. అటు పొన్నాల వర్గానికి, ఇటు కొమ్మూరి వర్గానికి దూరమై రెంటికి చెడ్డ రేవడిలా పరిస్థితి తయారవుతుందా..? అని చర్చించుకుంటున్నారు. గతంలో కూడా ఇలాగే జరిగిందని, అదంతా రాజకీయ వ్యూహంలో భాగమేనని మరి కొందరు చెబుతున్నారు. ప్రస్తుత డిసిసి అధ్యక్షులుగా కొనసాగుతున్న జంగా రాఘవరెడ్డి వరంగల్ పశ్చిమ నియోజక వర్గం వైపు స్వచ్ఛందంగా వెళ్ళిపోవడంతో మూడు వర్గాలుగా కొనసాగుతున్న జనగామ కాంగ్రెస్ రాజకీయ చదరంగంలో ఓ పావు తనంతట తానుగా పక్కకు తప్పుకున్నట్లేనని విశ్లేషకులు చెబుతున్నారు.



కొండలమ్మ జాతరకు పోటెత్తిన భక్త జనం

కొండలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే హరిప్రియ

నవతెలంగాణ-గార్ల

మండల పరిధిలోని పినిరెడ్డి గూడెం గ్రామ సమీపంలో ఉన్న కాకతీయుల కాలనాటి శ్రీ కొండలమ్మ దేవాలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా జాతరను బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు.జాతర మూడవ రోజు సందర్భంగా పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు, భక్తులు వందలాదిగా తరలివచ్చారు. పినిరెడ్డిగూడెం గ్రామంలో ప్రజలు, భక్తులు డిజె బాక్స్‌లను ఏర్పాటు చేసుకుని డ్యాన్స్‌లు చేస్తూ సందడిగా దేవాలయంకు చేరుకుని జాతరలో పాల్గొన్నారు. ఉగాది రోజు నిర్వహించిన ఈ జాతర ఉత్సవాల సందర్భంగా జాతరలో భక్తులు కిక్కిరిసిపోయారు.సమీప ప్రాంతాలకు చెందిన ప్రజలు,భక్తులు సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ మొక్కులు చెల్లించుకున్నారు.శ్రీ కొండలమ్మ తల్లిని దర్శించుకుని తీర్థప్రసాదాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

కొండలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే, ప్రముఖులు

కొండలమ్మ దేవాలయంలోఉగాది సందర్భంగా నిర్వహించిన జాతర ఉత్సవాలకు ఇల్లందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియా, తెలంగాణ ఇన్ కాంటాక్స్ కమిషనర్ లావుడ్యా జీవన్ లాల్, ఎంపిపి మూడ్ శివాజీ చౌహాన్, జడ్పీటీసి జాటోత్ ఝాన్సీ లక్ష్మీసర్పంచ్‌లు అజ్మీర బన్సీలాల్, నూనావత్ జ్యోతి నరసింహ నాయక్, భూక్య భారతీ, డి.సక్రు, రత్నావత్ శంకర్, ఎంపిటీసి ధనియాకుల రాజకుమారి, సాయి గౌరి, జ్యూలరీ షాపు యజమాని టి.విజయ్, ఉప సర్పంచ్ చింత ఎల్లయ్య, ఆలయ కమిటి చైర్మన్ పెంట్యాల శ్రీనివాస్,వివిధ పార్టీల నాయకులు గంగావత్ లక్ష్మణ్ నాయక్,మీగడ శ్రీనివాస్, వి.వెంకటేశ్వర్లు,బి.లక్ష్మారెడ్డి, ప్రముఖులు,భక్తులు దర్శించుకున్నారు. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండ ఎస్సై బానోత్ వెంకన్న అధ్వర్యంలో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ అధ్వర్యంలో అన్ని వసతులను ఏర్పాటు చేశారు.

సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ సస్యశ్యామలం

పంచాంగ శ్రవణ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఎర్రబెల్లి

నవతెలంగాణ-పాలకుర్తి

సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలంగా మారిందని, అభివృద్ధి సంక్షేమంలో అగ్రభాగాన నిలిచిందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. శోభకృత్ నామ తెలుగు సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. మండల కేంద్రంలో గల శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పాలకమండలి, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయం వద్ద నిర్వహించిన పంచాంగ శ్రవణ కార్యక్రమంలో మంత్రి ఎర్రబెల్లి పాల్గొని జాతక రాశి ఫలాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నేతృత్వంలో అమలవుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని అన్నారు. ఇప్పటికే బంగారు తెలంగాణ దిశగా రాష్ట్రం పయనిస్తుందని ఆకాంక్షించారు. ఈ ఉగాది ప్రజల జీవితాల్లో మరిన్ని ఉషస్సులు నింపాలని, ఈ ఏడాది శుభప్రదమై ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని అన్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా పడి, రాష్ట్రం పాడి పంటలతో, పసిడి కాంతులతో పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, ఆలయ చైర్మన్ వెనుకదాసుల రామచంద్రయ్య శర్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, జెడ్పి ఫ్లోర్ లీడర్ పుషక్కురి శ్రీనివాసరావు, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ వీరమనేని యాకాంతరావు, ఐలమ్మ మార్కెట్ కమిటీ చైర్మన్ ముస్కు రాంబాబు, ఆలయ ఈవో నండూరి రజిని కుమారి, బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, బీఆర్ఎస్ నాయకులు వర్రె వెంకన్న యాదవ్, డాక్టర్ మేడారపు సుధాకర్. ఆలయ పాలకమండలి సభ్యులు నరసింహారెడ్డి, వేణుడగోపాల్, ఉపసర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మారుజోడు సంతోష్ తోపాటు ఆలయ అర్చకులు, పాలకమండలి సభ్యులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉగాది వేడుకలు... పంచాంగ శ్రవణాలు...



నవతెలంగాణ-బచ్చన్నపేట

శోభకృత్ నామ ఉగాది పర్వదినం పురస్కరించుకొని మండలంలోని ఆయా గ్రామాల్లో భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండలంలోని పోచన్నపేట మండల కేంద్రంలోని శివాలయాల్లో పంచాంగ శ్రవణం చేశారు. ఆయా గ్రామాల పురోహితులు కార్తీక్ శర్మ, అర్వపల్లి శ్రీకృష్ణ శర్మలు నూతన పంచాంగ పఠనం చేశారు. రాశుల ఫలాలను వివరించారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు వడ్డేపల్లి మల్లారెడ్డి, గట్టు మంజుల, సామాజిక సేవాకర్త కొండి వెంకటరెడ్డి, బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు సద్ది సోమిరెడ్డి, జూకంటి గణేష్, ఈర్ల శివరాములు, గూడ సిద్దారెడ్డి, రాగిర్ మురళి,పెండెం ఆంజనేయులు, ముత్తినేని ఈశ్వరయ్య, పిన్న ఉప్పలయ్య, కొత్తపల్లి కాష్మతి, కంటిమ్ బాలరాజు పాల్గొన్నారు.



నెల్లికుదురు : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఆయా గ్రామాల దేవాలయాల వద్ద పంచాగ శ్రవణాన్ని వేద పండితులు ఘనంగా నిర్వహించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉగాది పచ్చడి చేసుకుని కుటుంబ సభ్యులతో పచ్చడి తాగారు. బ్రాహ్మణ కొత్తపెల్లి గ్రామంతో పాటు వివిధ గ్రామాలలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, గ్రామ ప్రజలు కలిసి వేద పండితులచే పంచాంగ శ్రవణాన్ని దేవాలయాల పేర్ల మీద, గ్రామ పరిపాలకుల పేర్లు మీద జాతకాలు బ్రాహ్మణ కొత్తపల్లి వేద పండితుడు బూరుగడ్డ సంపత్ కుమార్ ఆచార్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బీరవెల్లి యాదగిరి రెడ్డి, ఉప సర్పంచ్ చిర్ర యాకాంతం గౌడు, బొల్లు మురళి, పిఎసిఎస్ డైరెక్టర్ జిల్లా సోమయ్య, తాళ్ల రాంరెడ్డి, ఎస్.కె అమీర్, పెరుమాండ్ల శంకర్, నోముల వెంకన్న, చింతకుంట్ల యాకయ్య, ఉప్పలయ్య, పెరుమాండ్ల చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-లింగాలఘనపురం

మండలంలోని వడిచర్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఉప సర్పంచ్ గండి మల్లయ్య బుధవారం మృతి చెందారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొల్లూరు శివకుమార్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చిట్కుల వెంకటేశ్వర్లు, గ్రామ శాఖ అధ్యక్షుడు జోగు పరశురాములు, మాజీ ఉప సర్పంచ్ గండి అంజయ్య, మాజీ ఎంపీటీసీ జోగు సోమ నరసయ్య, పిఎసిఎస్ డైరెక్టర్ జోగు పుష్ప, మండల యువజన కాంగ్రెస్ నాయకులు పసునూరు ఉపేందర్, వార్డ్ మెంబర్ గండి నవీన్, సీనియర్ నాయకులు కానుగంటి కిష్టయ్య, బొత్తకింది కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పార్టీ కార్యాలయం ప్రారంభం



నవతెలంగాణ-నెల్లికుదురు

మండల కేంద్రంలో బిజెపి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించినట్లు బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రామచంద్రరావు మండల అధ్యక్షుడు చందు రాజ్ కుమార్ యాదవ్ తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం పార్టీ కార్యాలయంలో కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రతిరామ్‌తండా ఎంపీటీసీ గుగులోతు మదన్‌లాల్, నల్లని పాపారావు, సురేందర్, తాళ్లపల్లి వాసు, రఘు, శివ, సాయి తదితరులు పాల్గొన్నారు.